# ఐఎఎస్ అధికారుల పనితీరుపై ఐవిఆర్ఎస్ సర్వే

కుప్పం, ఆగస్టు 8 ప్రభాతవార్త : చిత్తూరు జిల్లాలో పనిచేస్తున్న ఐఎఎస్ అధికారుల పనితీరుపై ప్రభుత్వ ఐవిఆర్ సర్వే చేపడుతూ ప్రజల అభిప్రాయాలు తెలుసుకుంటోంది. జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడ) ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్‌ల పనితీరుపై ఐవిఆర్ఎస్ కాల్స్ ద్వారా సమాచారం సేకరిస్తున్నారు. ఈ అధికారులు ఇద్దరూ జిల్లాకు వచ్చి ఏడాది కాలం పూర్తయిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో వారి పనితీరు గురించి సర్వే చేపట్టారు. కాగా జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి జిల్లా అభివృద్ధిపై నిరంతర కృషి చేస్తున్నారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులు గాడిన పెట్టడంతో పాటు జిల్లాలో పెట్టుబడులు, పరి శ్రమలు వచ్చేందుకు కృషి చేస్తున్నారు. ఇటీవలే జిల్లాలో మామిడి రైతులకు



గిట్టుబాటు ధరలు లేని విషయం సిఎం చంద్రబాబునాయుడు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం నుంచి తోతాపురి రైతులకు కిలోకు 4రూ.ల మేర ప్రోత్సహం అందేలా చొరవ చూపారు. ఇక కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు కుప్పం ప్రా ంత అభివృద్ధి కోసం విజన్ 2029ను రూపొందించారు. కుప్పంకు వివిధ సంస్థలు వచ్చేలా ఆయన చొరవ చూపారు. కాగా ఇద్దరు యువ ఐఎఎస్ అధికారులు తమ బాధ్యతలు సమర్థవంతంగా నిర వ్రహిస్తూ ముందుకుసాగుతున్నారు.


తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త






# బిసీ సబ్సిడీ రుణం...ఇవ్వరా!

**- మార్చిలో ఇంటర్వ్యూలు నిర్వహించి ఏప్రిల్ 11న లబ్దిదారులకు మెగా చెక్కులు**
**- 535 యూనిట్లలో ఒక్క యూనిట్ గ్రౌండింగ్ కాని పరిస్థితి - బ్యాంకుల చుట్టూ లబ్దిదారులు ప్రదక్షిణలు -సబ్సిడీ మంజూరైతేనే గ్రౌండింగ్ చేస్తామన్న బ్యాంకులు**



చిత్తూరు, ఆగస్టు 8 ప్రభాతవార్త: జిల్లాలో బిసీ సబ్సిడీ రుణాలు మంజూరు చేయడానికి అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానించి, ఆ దరఖాస్తులను ఫిల్టర్ చేయడానికి దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించి, సబ్సిడీ రుణం మంజూరు చేయడానికి బ్యాంకులకు జాబితా సిద్ధం చేసి పంపి ఇప్పటికి ఆరు నెలలు పూర్తి కావస్తుంది. అయితే జిల్లాలో ఇప్పటి వరకు ఏ ఒక్క బ్యాంకులో సైతం ఏ ఒక్క బిసీ లబ్దిదారుడికి సబ్సిడీ రుణం గ్రౌండ్ చేయని పరిస్థితి నెలకొంది. సబ్సిడీ రుణం కోసం ఎంపికైన లబ్దిదారులకు బ్యాంకులకు వెళ్ళి రుణాలు గ్రౌండింగ్ చేయాలని బ్యాంకు అధికారులను కోరితే ప్రభుత్వం నుండి బిసీ సబ్సిడీ రుణాలపై ఇప్పటి వరకు తమకు ఎలాంటి సమాచారం లేదని, ప్రభుత్వం బిసీ సబ్సిడీ రుణాలకు సంబంధించి ముందస్తు సబ్సిడీ విడుదల చేస్తోందని చెప్పిందని, అయితే ఇప్పటి వరకు బిసీ రుణాల సబ్సిడీ బ్యాంకులకు మంజూరు చేయక పోవడంతో ఎంపికైన లబ్దిదారులకు యూనిట్లు గ్రౌండింగ్ చేయలేదని స్పష్టం చేస్తున్నారు. మరోవైపు జిల్లా బిసీ కార్పొరేషన్ అధికారులు సైతం ప్రభుత్వం నుండి బిసీ సబ్సిడీ రుణాలపై ఎలాంటి అప్‌డేట్ లేకపోవడంతో తాము బ్యాంకులకు ఏమి చెప్పలేకపోతున్నామని పేర్కొంటున్నారు. ఇప్పటికే బిసీ సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్దిదారులు ఆరు నెలలుగా బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తుండటంతో కొంతమంది లబ్దిదారులు అసలు బ్యాంకులు బిసీ సబ్సిడీ రుణాలు ఇస్తుంయా! లేదా! అని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గత ఐదేళ్ళ వైకాపా ప్రభుత్వంలో బిసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలు మంజూరు చేయకపోవడంతో జిల్లాలో అత్యధిక బిసీలు బిసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాల గురించి మరచిపోయారు. ఈ క్రమంలో రాష్ట్రంలో ఏడాది క్రితం అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం మళ్ళీ బిసీ కార్పొరేషన్‌కు పూర్వవైభవం తీసుకురావాలని నిర్ణయించి బిసీ సబ్సిడీ రుణాల మంజూరుకు నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ మేరకు బిసీ కార్పొరేషన్ ద్వారా రూ.1 లక్ష నుండి రూ.10 లక్షల వరకు సబ్సిడీ రుణాలు మంజూరు చేయడానికి మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాల్టీలు, మండలాలకు యూనిట్ల లక్ష్యాలు కేటాయించి ఆ మేరకు లబ్దిదారులకు ఎంపిక చేసి బ్యాంకులకు పంపాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు మార్చి నెలలో చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు జిల్లాలోని మున్సిపాల్టీల్లో మున్సిపల్ కమీషనర్లు, బ్యాంకు అధికారులు, అలాగే జిల్లాలోని 31 మండలాల్లో ఎంపిడిఓలు, స్థానికంగా వున్న బ్యాంకు అధికారులు దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించి లబ్దిదారులను ఎంపిక చేశారు. బిసీ సబ్సిడీ రుణ ఇంటర్వ్యూలకు హాజరై ఎంపిక కావడంతో ఇక బ్యాంకులు సబ్సిడీ రుణం మంజూరు చేయడమే తరువాయి అనే విధంగా ఎంపికైన లబ్దిదారులు అందరు భావించారు. మరోవైపు ఏప్రిల్ 11వ తేదీ బిసీ నేత డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకల్లో పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్, జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరిలు హాజరై బిసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలకు ఎంపికైన 535 లబ్దిదారులందరికీ రూ.11.58 కోట్ల రూపాయల మెగా చెక్కును అందజేశారు. జిల్లా స్థాయి వేదిక నుండి ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొని బిసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాల మెగా చెక్కును లబ్దిదారులకు అందజేయడంతో నెల రోజుల వ్యవధిలో అన్ని బ్యాంకులు బిసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలను గ్రౌండింగ్ చేస్తోందని లబ్దిదారుల ఆశలపల్లకిలో ఊరేగారు. తమకు బిసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణం మంజూరు అయ్యిందని, తనకు ఆ మేరకు యూనిట్ గ్రౌండ్ చేయాలని లబ్దిదారులు బ్యాంకులకు వెళ్ళి అడిగితే బిసీ సబ్సిడీ రుణాలపై ప్రభుత్వం నుండి తమకు ఇప్పటి వరకు ఎలాంటి సమాచారం లేదు. ప్రభుత్వం నుండి బిసీ సబ్సిడీ రుణాలకు సంబంధించి ఎదైనా అప్‌డేట్ వస్తే అప్పుడు రుణాలు గ్రౌండ్ చేస్తామని బ్యాంకర్లు లబ్దిదారులకు తేల్చి చెప్తున్నారు. మరోవైపు జిల్లా బిసీ కార్పొరేషన్ అధికారులకు సైతం బిసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలపై సరైన సమాధానం రావడం లేదు. ప్రభుత్వం నుండి తమకు ఎదైనా మార్గదర్శకాలు వస్తే ఆ మేరకు చెప్తామని బిసీ కార్పొరేషన్ అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికే బిసీ సబ్సిడీ రుణాల కోసం ఇంటర్వ్యూకు ఎంపికై నెలలు గడచిపోతు న్నప్పటికీ మంజూరైన బిసీ సబ్సిడీ రుణంను బ్యాంకులు గ్రౌండింగ్ చేయకపోవడంతో రుణాల కోసం ఎంపికైన లబ్దిదారులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఇది వరకు బిసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణం అంటే అధికారులు, బ్యాంకర్లు కలిసి లబ్దిదారులను ఎంపిక చేసేవారు. ఆ మేరకు ఎంపికైన వారికి బ్యాంకులు ఒక నెల రోజుల్లోపు రుణం మంజూరు చేసి గ్రౌండ్ చేసేది. ప్రభుత్వం ఆపై బిసీ కార్పొరేషన్ నుండి బ్యాంకులకు సబ్సిడీ మంజూరు చేసేది. అయితే ప్రస్తుత ప్రభుత్వం బ్యాంకులకు బిసీ కార్పొరేషన్ ద్వారా అడ్వాన్స్‌డ్ సబ్సిడీ మంజూరు చేస్తామని, సబ్సిడీ మంజూరైన అనంతరం బ్యాంకులు ఎంపిక చేసిన లబ్దిదారులకు రుణాలు గ్రౌండింగ్ చేయాలని పేర్కొనడంతో ప్రస్తుతం ఎంపికైన బిసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాల లబ్దిదారులకు రుణాలు గ్రౌండింగ్ కావడం లేదని తెలుస్తోంది. ప్రభుత్వం స్పందించి బిసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలకు ఎంపికైన లబ్దిదారులకు బ్యాంకుల నుండి రుణాలు త్వరితంగా గ్రౌండింగ్ అయ్యేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం వుంది.

# 30పడకల ఆసుపత్రి...పగటి కలేనా!

ప్రభాతవార్త -రేణిగుంట




రేణిగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రోగులకు సేవలు అందించడంలో వెనక పడుతోంది. మందులు లేకనా, సిబ్బంది తక్కువా, వైద్యులు లేరా, వసతులు లేవా, అంటే ఆసుపత్రికి ఉండాల్సిన అన్ని హంగులు ఉన్నాయి. ఎందుకు రోగులు హై రిస్క్ వస్తే తప్పనిసరిగా తిరుపతి రుయా ఆస్పత్రికి వెళ్లాల్సి వస్తోంది? అంటే సమాధానాలు లేవు. కుక్క కాటుకు మందు ఉంది. పాము కాటుకు మందు ఉంది. బిపి, షుగర్ వ్యాధులకు మందులు ఉన్నాయి. మండలంలో దాదాపు 1,50,000 మంది జనాభా ఉన్నారు. రేణిగుంటకు పంచాయితీకి మున్సిపాలిటీ స్థాయి ఓటర్లు ఉన్నారు. రేణిగుంట పట్టణంలోనే దాదాపు 50 వేల మంది జనాభా ఉన్నారు. మండలంలో అనేక కంపెనీలు, చాలా ఫ్యాక్టరీలు ఉన్నాయి. వేలాదిమంది ఇతర రాష్ట్రాల నుండి పొట్ట చేత పట్టుకుని బ్రతుకుతెరువు కోసం రేణిగుంటకు వస్తున్నారు. బ్రిటిష్ కాలం నాటి రైల్వే జంక్షన్ తోపాటు ఇటీవల నిర్మించిన అంతర్జాతీయ విమానాశ్రయం రేణిగుంటలో ఉన్నాయి. అందుకు తగ్గట్టు జనాభా రాకపోకలు అధికంగా ఉంది. ప్రస్తుతం సగటున రేణిగుంట జనాభా 1,50,000 మంది పైచిలుకు ఉన్నారు. రేణిగుంట ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన మారింది. ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు వైద్యులు, దాదాపు 12 మంది సిబ్బంది ఉన్నారు. ల్యాప్ సౌకర్యం ఉంది. ల్యాబ్ టెక్నీషియన్ ఉన్నాడు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగ నిర్ధారణ చేయగలరే కానీ అందుకు సంబంధించిన వైద్యాన్ని అందించలేకపోతున్నారు. రాత్రి సమయాలు పురిటి నొప్పులు వస్తే సాధారణ కాన్పు చేస్తారు. హై రిస్క్ కాన్పులు చేసే వసతులు ఉన్నప్పటికీ సరైన వైద్యులు లేక వారిని హుటాహుటిన తిరుపతికి తరలిస్తున్నారు. గతంలో టిడిపి, బిజెపి సంకీర్ణ ప్రభుత్వంలో అప్పటి మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ సంయుక్తంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడగల ఆసుపత్రిగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఇంకొక అడుగు ముందుకు వేసి 100 పడకల ఆసుపత్రి చేసిన ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదని ప్రజల సమక్షంలో హామీ ఇచ్చారు. వారు ఇచ్చిన హామీ హామీగానే మిగిలిపోయింది. కనీసం రేణిగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ గా అభివృద్ధి చేయాలని రేణిగుంట వాసుల ఆకాంక్ష. 30 పడకలు లేదా 100 పడకల ఆసుపత్రి చేస్తే పేద రోగులకు ఎంతో మేలు జరుగుతుంది. తండ్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ఇచ్చిన హామీని బొజ్జల సుధీర్‌రెడ్డి నెరవేర్చాల్సిన ఆవశ్యకత ఉంది.

# కాణిపాకంలో వైభవంగా వరలక్ష్మీవ్రతం

కాణిపాకం, ఆగస్టు 8 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామి వారి ఆలయంలో శుక్రవారం శ్రావణ వరలక్ష్మీవ్రతంను శాస్త్రోక్తంగా నిర్వహి ంచారు. శ్రావణమాసంలో శుక్రవారం వచ్చే వరలక్ష్మీవ్రతంను మహిళలు అత్యంత ఘనంగా జరుపుకోవడం ఆనవాయితీ. ఈమేరకు కాణిపాకం దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీదేవి భూదేవి సయిత వరదరాజ స్వామివారి ఆలయంలో అర్చకులు ఈవ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో స్వామివారికి ఆలయ ఉప ప్రధాన అర్చకులు శ్రీనివాస భట్టాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయంలోని మండపంలో లక్ష్మీదేవి ప్రతిమను ప్రతిష్టించి అలంకరించి వేదపండితుల మంత్రోచ్చారణ పడుమ శాస్త్రోక్తంగా వ్రతాన్ని ఆచరించి శ్రీవరలక్ష్మీ వ్రతం కథ మహత్యము గురించి భక్తులకు వివరించి తీర్థ,ప్రసాదాలను అందజేశారు. అలాగే రాత్రి స్వామివారి అమ్మవార్లకు గ్రామో త్సవంను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఆలయ ఉప ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు కుటుంబీకులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్, అర్చకులు, వేదపండితులు, కాణిపాకం పరిసర గ్రామాలకు చెందిన మహిళా భక్తులు పాల్గొన్నారు.



వరదరాజస్వామి ఆలయంలో వరలక్ష్మీవ్రతంను నిర్వహిస్తున్న అర్చకులు

# కరెంట్ బిల్లులు... మళ్ళీ షాక్!

**అప్పుడు ట్రూఅప్...ఇప్పుడు ఎప్‌పిపిసిఎ పేరుతో వసూళ్ళు బాదుడు**

ప్రభాతవార్త-తిరుపతి

సామాన్యవర్గాల ప్రజల పై విద్యుత్ బిల్లులు భారం మోపబోమని...విద్యుత్ ఛార్జీలు పెంచడం లేదని చెబుతున్న ప్రభుత్వం, విద్యుత్‌మంత్రి తాజాగా జారీ అవతున్న గృహావసరాల విద్యుత్ బిల్లులు మళ్ళీ షాక్‌నిస్తున్నాయి. గత ఐదేళ్ళలో తడిసి మోపెడైన విద్యుత్‌బిల్లుల భారం తట్టుకోలేక విలవిల్లాడిన సామాన్య,మధ్య తరగతి వర్గాల ప్రజలకు విద్యుత్ భారం తగ్గిందని భావిస్తున్న తరుణంలో గత పదినెలలుగా ఎంత విద్యుత్ వాడితే అంతే బిల్లు చెల్లించేలా జరిగింది. మళ్ళీ ఆగస్ట్‌నెల బిల్లు రెండురోజులుగా తిరుపతి నగరం, రూరల్‌లో, ఇతర మండలాల్లో జారీఅవుతుండటంతో ఆ బిల్లుల్లో వినియోగించిన విద్యుత్ ఛార్జీకంటే అదనంగా మోపిన భారమే ఎక్కువగా ఉంది. ఓ గృహావసర వినియోగదారుడు గతనెలరోజులు 70-80 యూనిట్లు విద్యుత్ వినియోగానికి 200రూపాయల వరకు బిల్లు చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఆ బిల్లులో అందుకు భిన్నంగా 450రూపాయల వరకు చెల్లించాలని విద్యుత్ సిబ్బంది బిల్లులను ప్రజల చేతికిస్తుండటంతో మరోసారి షాక్‌నిచ్చేలా మారిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ఐదేళ్ళ వైసిపి ప్రభుత్వం ట్రూఅప్ ఛార్జీల పేరుతో అద్దె ఇళ్ళలో ఉండే వినియోగదారులకు ఏ మాత్రం సంబంధంలేని పాత బకాయిలు గత నాలుగేళ్ళవి కూడా వసూలుచేసి కట్టించుకున్నారు. దీంతో కరెంట్ బిల్లులతో లబోదిబో మన్న జనానికి టిడిపి కూటమి ప్రభుత్వం ఊరటనిచ్చినట్లే మళ్ళీ బాదుడుకు సిద్దమైంది. ఈ కూటమి ప్రభుత్వం ట్రూఅప్‌ఛార్జీల పేరుతోగాక ఎప్‌పిపిసిఎ పేరుతో 2023 జనవరి నుండి 2023 ఆగస్ట్ వరకు ,2025 జూలై నెలకంటూ 100రూపాయలపైగానే బాదుడు వేసింది. ఇక కస్టమర్‌ఛార్జీల పేరుతో, ఫిక్స్‌డ్ ఛార్జీల పేరుతో కొత్తగా చేతికందిన కరెంట్ బిల్లులతో పేద,మధ్యతరగతి వర్గాల ప్రజలు 500,600 రూపాయలు బిల్లులు రావడంతో లబోదిబోమంటున్నారు. విద్యుత్ భారం మోపబోమని ఇటీవల రోజుల్లో విద్యుత్‌మంత్రి చెప్పిన మాటలు కూడా ఉత్తవేనని జనం విమర్శిస్తున్నారు. తాజా పరిస్థితుల్లో ఎస్‌పిడిసిఎల్ యాజమాన్యం



లెక్కల ప్రకారం గృహావసరాలకు ఎల్‌టి కేటగిరి 1 క్రింద నెలకు 30యూనిట్ల వరకు స్థిరఛార్జీలు 10 రూపాయలుగాను యూనిట్ కరెంట్‌కు 1 రూపాయి ,కస్టమర్ ఛార్జీలు 25రూపాయలు ఇలా వసూలు చేయడం జరుగుతుంది. నెలకు 75యూనిట్ల వరకు యూనిట్‌కు 3రూపాయలు ఛార్జిగా, కస్టమర్ ఛార్జీలు 30రూపాయలు, ఆ తరువాత 125 యూనిట్లకు యూనిట్ విద్యుత్‌కు 4.50రూపాయలుగా వసూలుచేస్తారు. కస్టమర్ ఛార్జీలుగా 45రూపాయలు వసూలుచేసేలా బిల్లుల్లో పేర్కొన్నారు. ఇంకా నెలకు 125 యూనిట్లనుండి 225 యూనిట్ల కరెంట్ వాడే గృహావినియోగదారులు యూనిట్‌కు 6 రూపాయలు లెక్కన ఛార్జీచెల్లించాలి. కస్టమర్ ఛార్జీలుగా 50 రూపాయలు నికరంగా వసూలుచేస్తారు. ఇదీ ఇప్పటి పరిస్థితుల్లో ఎస్‌పిడిసిఎల్ యాజమాన్యం గృహ వినియోగదారులపై గుదిబండ మోపుతోంది. ఎస్‌పిడిసిఎల్ పరిధిలోని అన్ని జిల్లాల్లో గృహవినియోగదారులకు ఆగస్ట్‌నెల విద్యుత్ బిల్లులు షాక్‌నిచ్చేలా అందడం విచారకరం. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం గృహావసరాల విద్యుత్‌బిల్లులపై మోపుతున్న బాదుడు తొలగించాలని పలువురు కోరుతున్నారు.

# తిరుచానూరులో సామూహిక వరలక్ష్మీవ్రతం

**అష్టలక్ష్మీమండపంలో వరలక్ష్మీవ్రతం -12 రకాల నైవేద్యాలు, సువాసనల పుష్పాలతో అలంకరణ**





పద్మావతి అమ్మవారి సన్నిధిలో వరలక్ష్మీ వ్రతం

తిరుచానూరు,ఆగస్టు 8ప్రభాతవార్త: అష్టలక్ష్మీమండపంలో సిరులతల్లి పద్మావతిఅమ్మవారి పర్యవేక్షణలో సామాహిక వరలక్ష్మీవ్రతాన్ని తిరుచానూరు అర్చకులు వేదోక్తంగా ఘనంగా జరిపించారు. అమ్మవారి ఉత్సవమూర్తిని 9గ్రంధులతో అలంకరించి, 12 రకాల నైవేద్యాలను నివేదించి, మహామంగళ హారతినిచ్చారు. పవిత్రమైన శ్రావణమాసంలో పౌర్ణమి ఘడియల్లో శుక్రవారం ఉదయం పద్మావతి అమ్మవారి ఆలయంలో సామూహిక వరలక్ష్మీవ్రతాన్ని అర్చకులు స్రోక్తంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయంలోని ఆస్థాన మండపంలో పద్మపీఠంపై ఉత్సవమూర్తిని అశీనులు చేసి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, కలశస్థాపన, అమ్మవారి ఆరాధన, అంగపూజ, లక్ష్మీసహస్రనామార్చన, అష్టోత్తరశతనామావళి నిర్వహించారు. పద్మావతిఅమ్మవారిని చామంతి, మల్లె, సంపంగి, తులసీ, పన్నీరు ఆకు, మరువం, తామరపూలు, వృక్షి వంటి సాంప్రదాయ పుష్పాలతో ఆరాధించారు. భక్తులను విశేషంగా ఆకట్టుకునేలా వ్రతమండపాన్ని 3టన్నుల సంప్రదాయ పుష్పాలు, ఆరు రకాల 30వేల కట్‌ఫ్లవర్స్‌తో ,బత్తాయి, ఆపిల్ వంటి పలురకాల పండ్లుతో సర్వాంగసుందరంగా అలంకరించారు. మహిళా భక్తులకు అమ్మవారి కంకణాలు, పసుపుదారాలు,గాజులు,కుంకుమ,పండ్లు సౌభాగ్యంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిటిడి ఈఓ జె.శ్యామలరావు దంపతులు, టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి దంపతులు,జెఈఓ వీరబ్రహ్మం దంపతులు, టిటిడి బోర్డు సభ్యులు భానుప్రకాశ్‌రెడ్డి దంపతులు, తుడ ఛైర్మన్ సి.దివాకర్‌రెడ్డి దంపతులు, పనబాకలక్ష్మి, సివిఎస్ఓ కెవి మురళీకృష్ణ, పద్మావతిఆలయ డిప్యూటీ ఈఓ పి.హరీంద్రనాథ్, విఎస్ఓలు ఎన్టీవి రామ్‌కుమార్, సురేంద్ర,ఆలయ సూపరింటెండెంట్ రమేష్, శ్రీవాణి,ఎఈఓ దేవరాజులు, అర్చకులు బాబుస్వామి, ఆలయ ఇన్‌స్పెక్టర్లు, 300మంది గృహస్థభక్తులు పాల్గొన్నారు. సాయంత్రం సిరులతల్లి పద్మావతిఅమ్మవారు స్వర్ణరథంపై విహరించి భక్తులను కటాక్షించారు.

# వరలక్ష్మీ వ్రతంతో కళ కళాడిన కైలాసం

**పూజలతో పునీతం... మొక్కులతో మోక్షం. - అధిక సంఖ్యలో వ్రతాన్ని ఆచరించిన మహిళా భక్తులు**

శ్రీకాళహస్తి,ఆగస్టు 8 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాయం శ్రావణ శుక్రవారం సందర్భంగా సామూహిక వరలక్ష్మీ వ్రతపూజలు నిర్వహించారు. పట్టణ నలుమూలల నుంచే కాకుండా చుట్టు పక్కల గ్రామాల నుంచి కూడా మహిళా భక్తులు తండోపతండాలుగా తరలి వచ్చారు. గతం కన్నా ఈ ఏడాది బ్రహ్మగుడిలో ఏర్పాటు చేయటంతో మహిళ సంఖ్య బాగా పెరిగింది. శ్రావణ మాసం మహిళలు నియమనిష్టలతో నిర్వహించే వ్రతం 'వరలక్ష్మీ వ్రతం' ఇందుకు ప్రతి ఏడాది శ్రీకాళహస్తీశ్వరాయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేయటం ఆనవాయితి. మహిళల మనోభావాలకు సంబంధించి పూజలు కాబట్టి అధికారుల పర్యవేక్షణలో జరిగే కార్యక్రమాలు కాబట్టి మహిళలకు సంబంధించి ఎలాంటి విమర్శలు ఆరోపణలు ఆరోపణలు లేకుండా ఏర్పాట్లును, రెండు రోజులుగా ఇఓ డి.బాపిరెడ్డి స్వయంగా పర్యవేక్షించారు. చిన్న ఆలయాల ఇన్‌చార్జి నాగభూషణం చక్కటి ఏర్పాట్లు చేపట్టారు. ఓంకార మఠం నుంచి బ్రహ్మగుడి వరకు మామిడి తోరణాలు పూల తోరణాలు, అరటి చెట్లతో ముస్తాబు చేశారు. నిత్యకళ్యాణం పచ్చతోరణం అన్నట్లు అరటి చెట్లతో ముస్తాబు చేశారు. బ్రహ్మగుడి వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై అమ్మవారి విగ్రహాన్ని అలంకరించి, కలశ స్థాపన గావించారు. వేదపండితులు అర్ధగిరి వ్రతం మహాత్మ్యంను పఠిస్తు ఒడగా సంబంధం గురుకుల్, కరుణాకర్ గురుకుల్, దక్షిణామూర్తి గురుకుల్ శాస్త్రోక్తంగా మహిళలు పూజలు నిర్వహించారు. మహిమా న్వితమైన ఈ వ్రతాన్ని ఆచరించుటకు దేవస్థానం తరఫున ఏర్పాట్లతో పాటు పలువురు భక్తులు వాయ నాల్ని అందించారు. పూజలను ఉదయం 7గంటల నుంచి ప్రారంభించారు. మొదటి విడత పూజల్లో ఇఓడి.బాపిరెడ్డి,డెప్యూటీ ఇఓ ఎన్ఆర్ కృష్ణారెడ్డి దంపతులు హాజరయ్యారు.ఏర్పాట్లును ఎఇఓలు హేమామాలిని, విద్యాసాగర్‌రెడ్డి,మోహన్, ఇఇ మురళీధర్‌రెడ్డి,శ్రీహరి,హరియాదవ్, టెంపుల్ ఇన్స్పెక్టర్లు సుదర్శనం నాయుడు, వెంకటస్వామిలు పర్యవేక్షించారు.



సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరిస్తున్న మహిళా భక్తులు

## శ్రీశ్రీ ముత్యాలమ్మ అమ్మవారి దేవస్థానంలో...

# వరలక్ష్మి వ్రత పూజలు

చిల్లకూరు, ఆగస్టు 8 ప్రభాతవార్త: శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం వర్ష రుతువు శ్రావణమాసం శుక్ల పక్షం చతుర్ధశి శుక్రవారం చిల్లకూరు మండలం తూర్పు కనుపూరు గ్రామంలో స్వయంగా వెలిసి ఉన్న శ్రీ శ్రీ ముత్యాల అమ్మవారి దేవస్థానం నందు శ్రావణ వరలక్ష్మి వ్రత పూజ సందర్భంగా దేవస్థానంలో మూల మూర్తికి అభిషేకము, సామూహిక వరలక్ష్మి వ్రతము నిర్వహించారు. ముత్తయిదులకు పసుపు, కుంకుమ గాజులు, చీర, రవిక, సారె, అందజేసారు. అనంతరం తీర్థ ప్రసాదములు అన్న ప్రసాదం నిర్వహించారు. ఉభయకర్తలు తోట కృష్ణ, మోహన్ల (గుమ్మడిపూడి )కుటుంబ సభ్యులు వ్యవహరించారు. పల్లకి సేవ ఉభయకర్తలుగా కోవూరు జనార్దన్‌రెడ్డి లక్ష్మి దంపతుల కుమారుడు.ఆదిత్య (నెల్లూరు) వ్యవహరించారు. ఈ కార్యక్రమాలను కార్య నిర్వాహణాధికారి నవీన్ కుమార్ పర్యవేక్షణలో నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని వరలక్ష్మి వ్రత పూజలో పాల్గొన్నారు.



శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి సన్నిధిలో వరలక్ష్మీ వ్రతం

# పదవుల కోసం కుస్తీలు

**- సంస్థాగత ఎన్నికల్లో తెలుగు తమ్ముళ్ల పోటాపోటీ**

సూళ్లూరుపేట, ఆగస్టు 8 ప్రభాతవార్త: అధికార తెలుగుదేశం పార్టీలో సంస్థాగత ఎన్నికల వేడి మొదలైంది. అధికారంలో పార్టీ ఉండటంతో పదవుల కోసం తెలుగు తమ్ముళ్లు కుస్తీలు పడుతున్నారు. తమకు కావాలంటే తమకు కావాలంటూ బాహాబాహీకి దిగడంతో పాటు పోటీలు పడుతున్నారు. ఇందుకు నిదర్శనంగా ఈ నెల 7న సూళ్లూరుపేట నియోజకవర్గంలోని ఆరు మండలాలకు సంబంధించి సంస్థాగత ఎన్నికలను నిర్వహించేందుకు పార్టీ పరిశీలకులు జడ్.శివప్రసాద్, ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ నాయుడుపేట, సూళ్లూరుపేటలలో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయుడుపేటలో ఓజిలి మండలానికి సంబంధించి ఇరువర్గాల వారు బాహాబాహీకి దిగడంతో వారిని శాంతింపచేసి కార్యక్రమాన్ని అయిందనిపించారు. అలాగే తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి సంస్థాగత ఎన్నికల విషయంలో



ఏకగ్రీవాలే తప్ప బాహాబాహీకి దిగడం, పోటాపోటీగా పదవుల కోసం కుస్తీలు పడటం వంటి చర్యలు సూళ్లూరుపేట నియోజకవర్గంలో ఎప్పుడూ లేవు. ప్రస్తుత పరిస్థితుల్లో ఏకగ్రీవాలు పక్కనపెట్టి పార్టీ అధ్యక్ష కార్యదర్శ పదవులకు కొంతమందిని ఎంపిక చేసి వారి పేర్లు అధిష్టాన వర్గానికి పంపారు. ఇందులో ఐవిఆర్ఎస్ సర్వే నిర్వహించి అధ్యక్ష కార్యదర్శి ఎన్నిక ఉందని పరిశీలకులు జడ్.శివప్రసాద్, ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తెలిపారు. ఇదిలావుంటే పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కష్టపడి పనిచేసిన వారిని పక్కనపెట్టి కొంతమంది కొత్తగా వైసీపీలో నుంచి వచ్చిన వారికి పదవులు కట్టబెడుతున్నారన్న ఆరోపణలు కూడా కార్యకర్తల నుంచి వినిపిస్తున్నాయి. పార్టీ అధిష్టానం పార్టీని నమ్ముకున్న వారికే పార్టీ పదవులు ఇవ్వాలని కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం నియోజక వర్గంలో అధికారంలో ఉంది కాబట్టే తమకు పదవులు కావాలని అందరూ ముందుకు వస్తున్నారని, ప్రతిపక్షంలో ఉండగా వీరంతా ఏమైపోయారంటూ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు. మొత్తంమీద తెలుగుదేశం పార్టీలో సంస్థాగత ఎన్నికల ప్రహసనం నియోజకవర్గంలో హాట్‌టాపిక్‌గా మారింది.

# కోర్కెలు తీర్చే కల్పవల్లికావమ్మ కథ

పూతలపట్టు, ఆగస్టు 8 ప్రభాతవార్త:



పూతలపట్టు మండలం, గొడుగు చింత నందు గ్రామస్తులు ఆధ్వర్యంలో సుమారు 10 సంవత్స రాలుగా భక్తులకు కొంగు బంగారంగా నిలిచినటువంటి కావమ్మ చరిత్రను కథగా వినిపించడం జరుగుతున్నది ఈ నెల 8 తేదీ నుండి 10వ తేదీ వరకు శుక్రవారం రాత్రి నుండి కథ ప్రారంభించి శనివారం అమ్మవారి సారే పంచుతూ ఆదివారం భక్తులు మొక్కుబడితో ఉపవాసం ఉండి అగ్నిగుండ ప్రవేశం చేస్తారు.

# ఎంపీ కృష్ణయ్యను కలిసిన పి.షణ్ముగం

చిత్తూరు హెల్త్, ఆగస్టు 8 ప్రభాతవార్త:



జాతీయ బీసీ సంక్షేమ సంఘం దక్షిణాది రాష్ట్రాల ఇన్‌ఛార్జ్ పి.షణ్ముగం శుక్రవారం దేశ రాజధాని న్యూఢిల్లీలో జాతీయ బీసీ సంక్షేమ సంఘ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్యను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్యతో కలిసి ఉభయ పార్లమెంటు సభలైన లోక్‌సభ, రాజ్యసభలను పి.షణ్ముగం, వై.నాగేశ్వరయాదవ్‌లు సందర్శించారు. అలాగే ఉభయ పార్లమెంటు సభల్లో పలువురు ప్రముఖులను ఈ సందర్భంగా వారు కలిశారు.

# విద్యాశక్తి వాయిదా



– రాష్ట్ర వైఎస్ఆర్‌టిఎ ట్రెజరర్ రెడ్డిశేఖర్‌రెడ్డి డిమాండ్

చిత్తూరు, ఆగస్టు 8 ప్రభాతవార్త:

ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో అమలు చేస్తున్న విద్యాశక్తి కార్యక్రమంను వాయిదా వేయాలని రాష్ట్ర వైఎస్ఆర్ టీచర్స్ అసోసియేషన్ కోశాధికారి వి.రెడ్డిశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. పాఠశాలల్లో విద్యాశక్తి కార్యక్రమంను సాయంత్రం వరకు నిర్వహించాలనుకోవడం అధికారుల అనాలోచిత నిర్ణయమన్నారు. నూతన కేడర్ స్ట్రెంత్ ప్రకారం ఉపాధ్యాయులకు ఒక పీరియడ్ మాత్రమే లీజర్ దొరుకుతుందని, రోజంతా నిముషం తీరిక లేకుండా ఉపాధ్యాయులు పాఠశాలల్లో సతమతం అవుతున్నారన్నారు. విద్యాశక్తి కార్యక్రమంను జనవరి నుండి అమలు చేయాలని అప్పటి వరకు వాయిదా వేయాలని ఆయన ప్రభుత్వంను డిమాండ్ చేశారు.

# డిసిసి ప్రధాన కార్యదర్శి(ఆర్గనైజేషన్)గా కందుకూరి హుమేష్

చిత్తూరు, ఆగస్టు 8 ప్రభాతవార్త:



జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి (ఆర్గనైజేషన్)గా వెదురుకుప్పం మండల కాంగ్రెస్ అధ్యక్షులు కందుకూరు హుమేష్ నియమితులయ్యారు. ఈ మేరకు డిసిసి అధ్యక్షులు పోటుగారి భాస్కర్ జిడినెల్లూరు నియోజకవర్గ కాంగ్రెస్ కో–ఆర్డినేటర్ రమేష్‌బాబు సమక్షంలో నియామక పత్రంను కందుకూరి హుమేష్‌కు అందజేశారు. కార్వేటినగరం మండలం అన్నూరు గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి (ఆర్గనైజేషన్) గా తనను నియమించిన పిపిసి అధ్యక్షురాలు షర్మిలారెడ్డికి, అలాగే తనకు పదవి రావడానికి సహకరించిన డిసిసి అధ్యక్షులు పోటుగారి భాస్కర్, జిడినెల్లూరు నియోజకవర్గ కో–అర్డినేటర్ రమేష్‌బాబులకు కందుకూరి హుమేష్ కృతజ్ఞతలు తెలిపారు.

# కుప్పంలో రోడ్డు విస్తరణకు అధికారుల కసరత్తులు

**– 68 అడుగులతో మూడో రీచ్ పనులు ఫిక్స్ !!**

కుప్పం, ఆగస్టు 8 ప్రభాతవార్త:



కుప్పం పట్టణ ప్రధాన రహదారి నేతాజీ రోడ్‌లో మూడో రీచ్‌లో రోడ్డు విస్తరణ పనులకు అధికారులు కసరత్తులు చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న రోడ్డును కలుపుకుని మొత్తం 68 అడుగుల మేర విస్తరించాలని నిర్ణయించినట్లు సమాచారం. రోడ్డు మధ్యభాగం నుంచి అటు 34, ఇటు 34 అడుగుల మేర రోడ్డు విస్తరణ చేపట్టాలని ప్రాథమిక అంచనాకు వచ్చినట్లు తెలిసింది. ఇందుకు సంబంధించి మార్కింగ్ పనుల ప్రక్రియ మొదలు పెట్టారు. శుక్రవారం మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు, ఆర్అండ్‌బి డిఇఇ దస్తగిరి, సర్వేయర్ల బృందం పట్టణ ప్రధాన రహదారిని, రోడ్డు పక్కన ఉన్న భవనాలను పరిశీలించారు. ఇప్పటికే రీచ్ 3 పరిధిలో భవనాలు కోల్పోయే బాధితులతో అధికారులు, స్థానిక అధికార పార్టీ నేతలు పలుమార్లు పరిహారం చెల్లింపుపై చర్చలు సైత ం జరిపారు.

# ఘనంగా శ్రీవరలక్ష్మి పండగ.. ప్రత్యేక పూజలు

**కుప్పంరూరల్, ఆగస్టు 8 ప్రభాతవార్త:** మండలంలో శుక్రవారం శ్రీవరలక్ష్మి అమ్మవారి పండగను పెద్దఎత్తున ప్రజలు జరుపుకున్నారు. కుప్పం పట్టణంలోని శ్రీ తిరుపతి గంగమ్మ ఆలయంలో ఆలయ కమిటీ ఛైర్మన్ బిఎంకె రవిచంద్రబాబు అధ్వర్యంలో శుక్రవారం రాత్రి వరలక్ష్మి వ్రతం, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# శ్రీకాశీవిశ్వేశ్వరాలయంలో పౌర్ణమి పూజలు

**రామకుప్పం, ఆగస్టు 8 ప్రభాతవార్త:**



స్థానికంగా ఉన్న శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం పౌర్ణమి పూజలను ఘనంగా నిర్వహిం చారు. ఆలయంలో రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించారు. శివనామస్మరణతో ఆలయం మార్మోగింది. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం జరిపారు. కాగా శుక్రవారం వరలక్ష్మి పూజను ఘనంగా జరుపుకున్నారు.

# కాణిపాకంలో వైభవోపేతంగా తిరుప్పావైసేవ

కాణిపాకం, ఆగస్టు 8 ప్రభాతవార్త:



కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీదేవి, భూదేవి సయిత వరదరాజ స్వామి ఆలయంలో శుక్రవారం తిరుప్పావై సేవ(అన్న కూటోత్సవం) అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. కలియుగ వైకుంఠం తిరుమల స్వామివారికి నిర్వహించే తరహాలో వరదరాజ స్వామివారికి తిరుప్పావైసేవను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఆలయ ప్రధాన అర్చకులు కాణిపాకంకు చెందిన పరవస్తు శ్రీనివాస భట్టాచార్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈసందర్భంగా ప్రత్యేకంగా తయారు చేయించిన పులిహోర అన్నంను ఆలయంలోని మండపంలో రాశులగా పోసి, వడలు, అప్పాలను వుంచి ధూపదీపాలతో ప్రత్యేకపూజలు నిర్వహించి స్వామివారికి నైవేద్యంగా సమర్పించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్, సూపరెంటెంట్ వాసు, ఆలాయ ప్రధాన అర్చకులు సోమశేఖర్ గురుకుల్, వరదరాజ స్వామివారి ఆలయ ప్రధాన అర్చకులు పరవస్తు శ్రీనివాస భట్టాచార్యులు, అర్చకులు కృష్ణామచార్యులు, రఘునందన్, స్థానిక సర్పంచ్ కెఎస్.శాంతిసాగర్‌రెడ్డి దంపతులతో పాటు ఆలయ అర్చకులు, ఉభయదారులు, భక్తులు పాల్గొన్నారు.

# తవణంపల్లెలో భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీవ్రతం

తవణంపల్లె ఆగస్టు 8 ప్రభాతవార్త:

వరలక్ష్మీవ్రతం పండుగ పర్వదినాన్ని మండలంలోని మహిళలు శుక్రవారం సంప్రదాయబద్ధంగా అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. శ్రావణమాసంలో శుక్రవారం వచ్చే వరలక్ష్మీవ్రతంను మండలంలోని మహిళలు అత్యంత ఘనంగా జరుపుకున్నారు. వ్రతం నిర్వహించే మహిళలతో మండలంలోని అమ్మవారి ఆలయాలు కళకళలాడాయి.

# గణనాధుని దర్శించుకున్న రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు

కాణిపాకం, ఆగస్టు 8 ప్రభాతవార్త:



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ గోపాల కృష్ణారావు, జస్టిస్ తుహిన్‌కుమార్‌లు వేర్వేరుగా శుక్రవారం కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని దర్శించు కున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. వారి వెంట ఆలయ ఏఈఓ ఎస్వీ.కృష్ణారెడ్డి సూపరెండెంట్ వాసు,చిత్తూరు రూరల్ వెస్ట్ సీఐ శ్రీధర్‌నాయుడు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ చిట్టిబాబు,స్థానికఎస్సై నరసింహులులతోపాటు ఐరాల రెవన్యూ, చిత్తూరు కోర్టు సిబ్బంది పాల్గొన్నా రు.

# వైభవంగా శ్రీ వరలక్ష్మిదేవి వ్రతం

పుంగనూరు, ఆగస్టు 8 ప్రభాతవార్త :



శ్రీ వరలక్ష్మిదేవి వ్రతాన్ని పట్టణ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలందరూ వైభవంగా నిర్వహించుకున్నారు. శ్రావణమాసం చతుర్దశి రోజున ఉదయమే అమ్మవారిని తమ ఇండ్లలో భక్తిశ్రద్ధలతో కొలువుంచి తమ స్థాయికి తగ్గ రీతులలో పూజలు నిర్వహించారు. వైష్ణవాలయాలలో అమ్మవారిని కొలువుంచి సామూహిక శ్రీ వరలక్ష్మి దేవి వ్రతాన్ని ఆచరించారు.

# మాధవ్ పర్యటనను విజయవంతం చేయండి

పుంగనూరు రూరల్, ఆగస్టు 8 ప్రభాతవార్త:



రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ జిల్లా పర్యటన విజయవంతం చేయాలని పట్టణ పార్టీ అధ్యక్షుడు జగదీష్ రాజు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర పార్టీ నేత ఈ నెల 11 చిత్తూరులో మహాసభ లో పాల్గొంటారని, ఈ సందర్భంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడప మల్లికార్జాన్ని పెద్దమఠం బాబు, చంద్రశేఖర్ రాజు, వెంకట్ రెడ్డి, మనీ, జగన్నాథం, రమేష్ నాగరాజా ఉమేష్, సుబ్రహ్మణ్యం రాజు శ్రీనివాసులు రాజు యువ నాయకులు హర్షవర్ధన్ రాజురెడ్డి కుమార్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలకు సౌభాగ్యం పంపిణీ

పుంగనూరు, ఆగస్టు 8 ప్రభాతవార్త :



పట్టణంలోని శ్రీ కళ్యాణ వెంకటరమణ స్వామి వారి ఆలయంలో శుక్రవారం ఉదయం శ్రీ వరలక్ష్మి దేవి వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. టిటిడి ఆధ్వర్యం లో జరిగిన అనంతరం మహిళలకు తిరుచానూరు శ్రీ పద్మావతి దేవి ఆలయం తరఫున గాజులు పసుపు కుంకుమ సౌభాగ్యాలను పంపిణీ చేశారు.

# శ్రీ వాల్మీకి మహర్షి విగ్రహా ప్రతిష్ట

సోమల, ఆగస్టు 8 ప్రభాతవార్త:



సోమల మండలం బోనమండ గ్రామంలో శ్రీ వాల్మీకి మహర్షి విగ్రహాన్ని విశ్రాంత డీఎస్పీ, పుంగనూరు నియోజకవర్గ టీడీపీ అధ్యక్షుడు సుకుమార్ బాబు స్వయంగా విరాళంగా అందించారు. అనంతరం ఆయన స్వయంగా గ్రామానికి విచ్చేసి, ముఖ్య అతిథిగా కార్యక్రమంలో పాల్గొని విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో ఈ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రగతిదాత సేవా సంస్థ ట్రెజరర్ సులోచన, వాల్మీకి నాయకుడు నాగరాజా, బీసీ సెల్ అధ్యక్షుడు జనార్ధన్, ఆర్యవైశ్య టీడీపీ నాయకుడు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడిన సుకుమార్ బాబు, గ్రామానికి వాటర్ ట్యాంక్, అంగన్వాడీ భవనం, పాఠశాల కాంపౌండ్ వంటి మౌలిక వసతుల అవసరాన్ని గుర్తించారని తెలిపారు. ఈ సమస్యల పరిష్కారానికి పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ చల్లా బాబు ద్వారా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

# భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం

చౌడేపల్లి, ఆగస్టు 8 ప్రభాతవార్త:



వరలక్ష్మీ వ్రత పర్వదినాన్ని పురస్కరించుకొని మండలం లో మహిళలు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. శ్రావణమాసం శుక్రవారం అమ్మవార్ల ఆలయాలన్నీ భక్తులతో నిండిపోయాయి. స్థానిక శ్రీ మృత్యుం జయేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని పార్వతీదేవి, గ్రామదేవత చౌడేశ్వరీ దేవాలయం, కన్యకాపరమేశ్వరి, శెట్టిపేట మోక్షవినాయకస్వామి ఆలయాల్లో విశేష పూజలు జరిగాయి.

# మానవత్వం చాటుకొన్న... గువ్వల

చౌడేపల్లి, ఆగస్టు 8 ప్రభాతవార్త :



స్కూటర్‌ను పడ్డ వ్యక్తికి సపరియలు చేసి ఆసుపత్రిలో చేర్పించిన మండల తేదేపా అధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి మానవత్వాన్ని చాటుకొన్నాడు. చౌడేపల్లి–తిరుపతి ప్రధాన మార్గంలో తిరుపతి వెళుతున్న స్కూటర్‌కు పశువు అడ్డంగా రావడంతో అదుపుతప్పి కిందకు పడ్డాడు. సదుంకు చెందిన వ్యక్తి తీవ్ర గాయాలపాలయ్యాడు. ఆసమయంలోనే అటుగా కారులో వెళుతున్న మండల తేదేపా అధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి(చిట్టి) గాయపడ్డ స్కూటరిస్టుకు సపరియలు చేసి తన కాన్వాయ్‌లోని వాహనం ద్వారా ఆసుపత్రికి తరలించాడు. స్కూటరిస్టును రక్షించిన గువ్వలను మానవత్వమున్న వ్యక్తిగా కొనియాడారు.

# గంగమ్మ ఆలయంలో శ్రావణ శుక్రవారం పూజలు

బోయకొండ(చౌడేపల్లి), ఆగస్టు 8 ప్రభాతవార్త :



శక్తిస్వరూపిణీ బోయకొండ గంగమ్మ ఆలయంలో విశేష పూజలు, రాహుకాలాభిషేకం నిర్వహించారు. శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ వ్రతం కావడంతో అమ్మ వారి ఆలయంలో భక్తుల రద్దీ పెరిగింది. రాహుకాల సమయంలో అమ్మవారికి వేదపండితులు, అర్చకుల ఆధ్వర్యంలో విశేషాభిషేకం అలంకరణగావించారు. మండల తేదేపా అధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి, శ్రీధర్‌రాజు(గిరి), బోయకొండ సుబ్బు తదితరులు అమ్మవారి సేవలో పాల్గొన్నారు. ఇఒ, ఉపకమీషనర్ ఏకాంబరం భక్తులకు అన్నదాన శిబిరాన్ని ఏర్పాటు చేసారు. పలమనేరు నవీన్ అతని మిత్రబృందం అన్నదాన శిబిరానికి కూరగాయాలందించారు.

# బోయకొండ ఆలయ ధర్మకర్తల మండలికి నోటిఫికేషన్ విడుదుల

బోయకొండ(చౌడేపల్లి), ఆగస్టు 8 ప్రభాతవార్త :



రాష్ట్రంలోనే శక్తిక్షేత్రంగా విరాజిల్లుతున్న బోయ కొండ గంగమ్మ ఆలయ ధర్మకర్తల మండలి నియా మకానికి నోటిఫికేషన్ విడుదల అయ్యింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన 14నెలలకు నోటిఫి కేషన్ విడుదల కావడంతో సర్వత్రా చర్చినీయాం శమైంది. ఈ మేరకు రాష్ట్ర ప్రిన్సిపల్ కార్యదర్శి, దేవాదాయ ధర్మాదాయశాఖ కమీషనర్ నుంచి ఉత్తర్వులు వచ్చినట్లు ఇఒ, ఉపకమీషనర్ ఏకాంబ రం తెలిపారు. నియామక ఉత్తర్వులు జారీ చేసినప్పటి నుంచి 20రోజులలోపు ఈనెల 27వరకు ఆసక్తి గలవారు బోయకొండ గంగమ్మ దేవస్థానంలో ధరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు ప్రభుత్వ, దేవాదా యధర్మాదాయశాఖవారినిబంధనలుపాటించాలనీ, మరిన్ని వివరాలకు దేవస్థానంలో సంప్రదించాలన్నారు.

# నాక్ అక్రిడిటేషన్ వ్యవధి పొడిగింపు

చిత్తూరురూరల్, ఆగస్టు 8 ప్రభాతవార్త:

చిత్తూరునగరం, మిట్టూరులోని విజయం సైన్స్ అండ్ ఆర్ట్స్ డిగ్రీ కళాశాల యుజిసి నుంచి స్వయంప్రతిపత్తి సాధించడం ద్వారా బెంగళూరులోని నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేసన్ కౌన్సిల్ నాక్ అక్రిడిటేషన్ వ్యవధిని డిసెంబర్ 31, 2030వరకు పొడిగించినట్లు విజయం విద్యాసంస్థల అధినేత ఎం.తేజోమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు.

# బ్రహ్మోత్సవ ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

చిత్తూరురూరల్, ఆగస్టు 8 ప్రభాతవార్త:



చిత్తూరుపట్టణం, గిరింపేటలో వెలసిన శ్రీ దుర్గాంబ దేవస్థానం నందు జరగబోవు దసరా బ్రహ్మోత్సవ ఆహ్వాన పత్రికను చిత్తూరు శాసనసభ్యులు గురజాల జగన్మోహన్ శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన కూటమి నాయకులు తదితరులతో కలసి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించి దసరా బ్రహ్మోత్సవ ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎఎస్ మనోహర్, ఎమ్మెల్యే సోదరుడు గురజాల జీవన్, అట్లూరి శ్రీనివాసులు,ఇతరనాయకులు, దేవస్థానం కమిటీ సభ్యులు, తెదేపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పివికెయన్ విద్యార్థులకు ప్రథమ బహుమతి

చిత్తూరురూరల్, ఆగస్టు 8 ప్రభాతవార్త:




చిత్తూరునగరం సీతమ్స్ ఇంజనీరింగ్ కళాశాల నందు అంతరిక్ష దినోత్సవం సందర్భంగా ఇంజనీరింగ్ కళాశాల, ఇస్రో ఎన్ఎఆర్ఎల్ గాదంకీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ అంశాలలో తమ కళాశాలకు చెందిన విద్యార్థులకు క్విజ్‌విభాగంలో ప్రథమ బహుమతి, ప్రాజెక్ట్ ప్రెజంటేషన్ నందు తృతీయ బహుమతి లభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ జీవన్ జ్యోతి తెలిపారు. విద్యార్థులను అభినందించడంతో పాటు ఈ పోటీలకు సిద్ధం చేసిన అధ్యాపకులు భానుప్రసాద్, అల్లురమేష్, మల్లికార్జమ రాంబిక, రామమూర్తి, రామసాగర్, ఉదయభాస్కర్, నవనీత, శ్రీవిద్యలను ప్రశంసించారు.

# భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రతం



రామచంద్రాపురం, ఆగస్టు 8 ప్రభాతవార్త: భక్తిశ్రద్ధలతో మహిళలు వరలక్ష్మి వ్రతం జరుపుకున్నారు. ఉదయం మహిళలు అమ్మవారి ప్రతిమను అలంకరించి, వరలక్ష్మి వ్రతాన్ని చదివి భక్తులకు వినిపించారు. రాయలచెరువు పేటలో టిడిపి మండల అధ్యక్షుడు తిరుమల రెడ్డి దంపతులు తమ ఇంట వరలక్ష్మివ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వ్రతానికి ముఖ్యఅతిథిగా శ్రీశక్తి పీఠాధీశ్వరి శ్రీరమ్యానంద భారతి హాజరయ్యారు. ఈసందర్భంగా ఆమెకు వేదమంత్రోచ్చారణల నడుమ పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం దంపతులు మాతాజీ ఆశీస్సులు పొందారు. వ్రతానికి హాజరైన ముత్తైదువులకు పసుపు కుంకుమలతో సారెను అందజేశారు.

# ధర్మకర్తల మండలి నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం..!

చంద్రగిరి, ఆగస్టు 8 ప్రభాతవార్త:

చంద్రగిరి గ్రామదేవత, సత్యప్రమాణాలకు నెలవై కొలువుదీరిన శ్రీ మూలస్థాన ఎల్లమ్మ వారి ఆలయ ధర్మకర్తల (పాలక) మండలిలో సభ్యులుగా నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తూ ఆంధ్రప్రదేశ్ ధార్మిక పరిషత్ కార్యదర్శి విజయవాడ వారి ద్వారా నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఆలయ ఈఓ మమత తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆమె పాలక మండలి సభ్యులుగా నియామకానికి ఆసక్తి కలిగిన వారు దరఖాస్తులు తిరుపతి జిల్లా, దేవాదాయ ధర్మాదాయ శాఖ, జిల్లా దేవాదాయ అధికారికి 20 రోజుల లోపు కార్యాలయ పనివేళలో నేరుగా అందజేయాలనీ లేదా రిజిస్టర్ పోస్టు ద్వారా పంపాలని కోరారు. అభ్యర్థులు దరఖాస్తుతో పాటు కుల ధృవీకరణ పత్రం, ఆధార్ జిరాక్స్, పాసుపోర్టు సైజు ఫోటోలు -2, అఫిడవిట్ సర్టిఫికేట్ జతచేసి పంపాలని కోరారు.

# భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీ వ్రత పూజలు

నారాయణవనం, ఆగస్టు 8 ప్రభాతవార్త :



శుక్రవారం వరలక్ష్మీ వ్రత పూజలను భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. మండలకేంద్రంలోని నారాయణవనం టిటిడి ఆలయం పద్మావతీదేవి ఆలయం, ఎగువ పద్మశాలీవీధిలోని వీరరాఘవుల స్వామి ఆలయం, తాతా సొరకాయులస్వామి ఆలయం, భీమునిచెరువులోని ఓంశక్తి అమ్మవారి ఆలయంతో పాటు తమతమ ఇళ్లలో అమ్మవారి ప్రతిమలు, విగ్రహాలను పెట్టి భక్తి శ్రద్దలతో మొక్కారు.

# ఘనంగా అర్జునతపస్మాన్

నారాయణవనం, ఆగస్టు 8 ప్రభాతవార్త :



మండల కేంద్రంలోని నారాయణ వనంలో గత ఎనిమిది రోజులుగా ద్రౌపతీదేవీ సమేత ధర్మరాజులస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండల వాణివైశ్య సంఘం ఆద్వర్యంలో ఉదయం అర్జునత పస్మాన్ సాయంత్రం ఆవుల మలేయుట కార్యక్రమం ఘనంగా జరిగింది. అంతకుముందు ఉదయం 12గంటలకు అర్జున పాత్రదారుడు 18మెట్లను ఎక్కుతూ మెట్టుకు ఒకపాటను పాడుతూ శిఖరానికి చేరడం జరిగింది. ఆ సమయంలో మహిళలు అధిక సంఖ్యలో ఆలయం వద్దకు చేరుకొని తడిబట్టలతో వర ం కోసం వేడుకున్నారు. చివరకు అర్జునపాత్రదారుడు నిమ్మకాయలను క్రిందకు వేయడంతో మహిళలు, భక్తులు ఎగబడ్డారు. సాయంత్రం వైశ్య వాణిజ్య సంఘం వారి ఆద్వర్యంలో ఉత్తరగోగ్రహణం జరిగింది. పాండవులు ఉత్తరగోగ్రహం సందర్బంగా అరుణానదిలో ఆవుల మందను మలేయడం భక్తులను మరింతగా ఆకట్టుకుంది. సాయంత్రం 5గంటలకు కల్పవృక్ష వాహనంపై స్వామి అమ్మవార్లను ఊరేగించారు.



# ఘనంగా రాఖీ పౌర్ణమి పూజలు

నారాయణవనం, ఆగస్టు 8 ప్రభాతవార్త :

మండలంలోని వికెపాలెం పంచాయతీ పరిధి నాగిలేరు సమీపం శింగిరికోనలో వెలసిన లక్ష్మీనరసింహస్వామివారి ఆలయం, నారాయణవనం తాతాసొరకాయులస్వామి ఆలయాల్లో శుక్రవారం రాఖీ పౌర్ణమి పూజలను ఘనంగా జరుపుకున్నారు. వేలాదిగా భక్తులు తరలివచ్చి తాతాసొరకాయులస్వామి సేవలో తరించారు.

# రైలు ఢీకొని గుర్తు తెలియని వృద్ధురాలు మృతి

పుత్తూరు రూరల్, ఆగస్టు 8 ప్రభాతవార్త:

రైలు ఢీకొని గుర్తు తెలియని వృద్ధురాలు మృతి చెందిన సంఘటన శుక్రవారం పుత్తూరు మండల పరిధిలో జరిగింది. రేణిగుంట రైల్వే ఎస్ఐ ధర్మేంద్రన్ రాజు కథనం మేరకు... పుత్తూరు తడుకు రైల్వేస్టేషన్ మధ్యలో శుక్రవారం మధ్యాహ్నం గుర్తు తెలియని వృద్ధురాలు(60) రైలు ఢీకొని మృతి చెందినట్లు రైల్వేస్టేషన్ మైనారిటీ సమాచారం అందించాలన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.

# అసిస్టెంట్ రిజిస్టర్ పై సమగ్ర విచారణ జరపాలి.

తిరుపతి విద్య ఆగస్టు 8 ప్రభాత వార్త

ఎస్వి వెటర్నరీ విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ రిజిస్టర్ గా పనిచేస్తున్న కిరణ్ బాబు పై పూర్తిస్థాయిలో విచారణ చేసి చర్యలు తీసుకోవాలని అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు తాళ్లపాక దాము డిమాండ్ చేశారు.ఈ మేరకు వెటర్నరీ యూనివర్సిటీ విసి రమణకు లేఖ రాశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసిస్టెంట్ రిజిస్టర్ గా ఉన్న కిరణ్ బాబు పై పలు అనుమానాలు ఉన్నాయని,అయినా కారుణ్య నియామకాల కింద ఉద్యోగంలో చేరారని తెలిపారు.

ఆయన తండ్రి మునిరత్నంకు సంబంధించి తప్పుడు ధ్రువపత్రాలు సమర్పించినట్లు స్పష్టమైన ఆధారాలు ఉన్నాయని తెలిపారు. పలుమార్లు ఈ విషయంపై వార్తాపత్రికలు దళిత సంఘాలు కోడే కూసిన అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు.

తక్షణం విసీ స్పందించి ఈ విషయంపై పూర్తిస్థాయి విచారణ డిమాండ్ చేశారు.

# వెనుకబడ్డ వర్గాల అభ్యున్నతే తెదేపా లక్ష్యం : మాజీ ఎమ్మెల్సీ

శాంతిపురం, ఆగస్టు 8 ప్రభాతవార్త:




రాష్ట్రంలో ఉన్న వెనుకబడిన వర్గాల అభ్యున్నతే తెలుగుదేశం పార్టీ లక్ష్యం అని మాజీ ఎమ్మెల్సీ, తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి గౌనివారి శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో సిఎం చంద్రబాబు నేతృత్వ ంలో మంత్రి నారా లోకేష్ సహకారంతో వెనుకబడిన వర్గాల వారికోసం కూటమి ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. రాష్ట్రంలోని ఆలయాల్లో పనిచేసే నాయీ బ్రాహ్మణులకు వేతనాలు 25వేలకు పెంచడంతో పాటు సెలూన్ షాప్‌లకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించడం జరుగుతోందన్నారు. కూటమి ప్రభుత్వం బిసిల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందన్నారు.

## గిరిప్రదక్షిణకు సాగిన జనం

**శ్రీకాళహస్తి,ఆగస్టు 8 ప్రభాతవార్త :**



శ్రీకాళహస్తీశ్వరునికి అనుబంధంగా కైలాసగిరుల్లో పౌర్ణమి సందర్భంగా శుక్రవారం యువకులు గిరిప్రదక్షిణకు బయలు దేరారు. శ్రీకాళహస్తిలోని వాయులింగేశ్వరుని సన్నిధిలో గిరి ప్రదక్షిణను యువకులు నిర్వహిస్తున్నారు. సుమారు 21కిలో మీటర్ల నిడివి గల పర్వత పంక్తుల్లో మధ్యలో మండపాలు, రామాపురం రిజర్వాయర్‌లున్నాయి.

## సిఎంను కలసిన ఎన్ ఆర్‌ఐలు

**శ్రీకాళహస్తి,ఆగస్టు 8 ప్రభాతవార్త :**



రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పి4 బంగారు కుటుంబాల సదస్సు లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును శుక్రవారం కలసి మీరు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమాలకు మా సహకారం అందిస్తామని ఇద్దరు ఎన్‌ఆర్‌ఐలు తమ ఉద్దేశ్యంను వివరించారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తికి చెందిన ఇద్దరు ఎన్‌ఆర్‌ఐలు జహీర్ అహమ్మద్‌షేక్, ఖతర్ సెంట్రల్ బ్యాంకు 2022 ఫిఫ్ట వరల్డ్ కప్‌ముద్రించిన స్పెషల్ పాలిమార్‌యూనిక్ నోట్‌ను ఎన్‌ఆర్‌ఐ తరఫున ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు అందించారు. శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎంఎల్‌ఏ సుధీర్‌రెడ్డి సూచనలతో ఉన్నం నవిన్‌కుమార్ కూడా తమ మద్దతును ప్రకటించారు.

## కళాకారులను సత్కరించిన బృందమ్మ

**శ్రీకాళహస్తిరూరల్, ఆగస్టు 8 ప్రభాతవార్త :**



నియోజకవర్గంలోని ఏర్పేడు మండలం పాపానాయుడుపేటలో వెలసిన ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఉత్సవాల ప్రధాన ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో పగలు ఉత్సవాలతో పాటు ప్రతిరోజూ రెండు వేళల్లో వాహనసేవలు నిర్వహిస్తున్నారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపధ్యంలోశుక్రవారం అర్జున తపస్సు సందర్భంగా ఆలయంలో వెలసిన స్వామి అమ్మవార్లను శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి మాతృమూర్తి బొజ్జల బృందమ్మ తమ పార్టీ నాయకులతో కలసి దర్శించుకున్నారు. ఆమెతో పాటు మార్కెట్ కమిటి మాజీ చైర్మెన్ రంగినేని చెంచయ్యనాయుడు,మండల పార్టీ అధ్యక్షుడు పేరం నాగరాజు నాయుడు,బత్తల గిరిబాబునాయుడు పార్టీ నాయకులు హాజరయ్యారు.

## నందీశ్వరునిపై నీలకంఠుని దివ్యదర్శనం

**శ్రీకాళహస్తిరూరల్,ఆగస్టు 8 ప్రభాతవార్త :**

శ్రీకాళహస్తి మండలం ఊరందూరు గ్రామంలో వెలసిన నీలకంఠేశ్వరుని బ్రహ్మోత్సవాలను కన్నుల పండువగా నిర్వహిస్తున్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న నీలకంఠేశ్వరుని బ్రహ్మోత్సవాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ నేపధ్యంలో ఉత్సవాల నిర్వహణకు అత్యధిక ప్రాదాన్య ఇస్తున్నారు. ఈ నేపధ్యంలో చిన్న ఆలయాల పర్యవేక్షకుడు లక్ష్మయ్యకు సహాయకులుగా రవి,దుర్గా ప్రసాద్‌లను నియమించారు. వారి పర్యవేక్షణలో ఉత్సవాలు కన్నుల పండువగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఆలయంలో స్వామి అమ్మవార్లను ఆలయ ప్రధానార్చకులు జనార్ధన్ శర్మ,గిరిధర్ శర్మలు ముస్తాబు చేసారు. నందీశ్వరునిపై ప్రతిష్టించి గ్రామోత్సవం నిర్వహించారు.

## హ్యాండ్స్ ఆన్ వర్క్ షాపు ప్రారంభం

**తిరుపతి హెల్త్, ఆగస్టు 8 ప్రభాతవార్త :**




ఎస్వీ వైద్య కళాశాల, మెటర్నిటీ ఆస్పత్రిలలో శుక్రవారం ఘనంగా సీమాంధ్ర పల్మనాలజిస్ట్‌ల అసోసియేషన్ వార్షిక రాష్ట్ర సదస్సు ఏపీఎస్‌ఏసీఓఎన్ 2025లో భాగంగా హ్యాండ్స్ ఆన్ వర్క్ షాపులు ప్రారంభం అయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తిరుపతి మేయర్ డాక్టర్ శిరీషా హాజరై మాట్లాడారు. ఈ వర్క్‌షాపులో ఐదు ఆధునిక విభాగాలపై డాక్టర్ల బృందం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు, దేశ వ్యాప్తంగా వచ్చిన పీజీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నేటి నుంచి రెండు రోజుల పాటు విద్యార్థులకు క్విజ్ పోటీలు, ఉపన్యాసాలు ఉంటాయి.

## ఇంటింటికి పార్టీ సిద్ధాంతాలు

**తిరుపతి కలెక్టరేట్, ఆగస్టు 8 ప్రభాతవార్త :**



బీజేపీ ఈస్ట్ మండలం అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన ఆదం అనిల్‌రెడ్డి శుక్రవారం గ్రామ గ్రామ ఇంటికి తిరుగుతూ బీజేపీ పార్టీ సిద్ధాంతాలను తెలియజేశారు. కేంద్రంలో బీజేపీ పార్టీ అధికారంలో ఉంటే అన్ని వర్గాలకు మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు మునిసుబ్రమణ్యం, మల కుప్పం శేఖర్, నవీన్ రాయల్, ప్రభాకర్, సతీష్, వెంకట కృష్ణయ్య, రామకృష్ణ, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## సంప్రదాయ పద్ధతిలో వరలక్ష్మీ వ్రతాలు

**చంద్రగిరి, ఆగస్టు 8 ప్రభాతవార్త:**



తెలుగింటి పండుగ మన సంస్కృతీ సంప్రదాయాలతో మహిళలు శుక్రవారం భక్తిప్రపత్తుల నడుమ వరలక్ష్మి వ్రతాలు జరుపకున్నారు. ఇందులో భాగంగా చంద్రగిరి గ్రామదేవత శ్రీ మూలస్థాన ఎల్లమ్మ వారి ఆలయంలో, అదేవిధంగా మిట్టగంగమ్మ, తొండవాడ వద్ద గల శ్రీఉగ్రప్రత్యంగిరాదేవి పీఠంలో ఆలయ అర్చకులు అమ్మవార్లకు మూలమూర్తులతో పాటు ఇతర పరివార దేవతామూర్తులకు అభిషేకాధి నిత్యకైంకర్యాలను శాస్త్రోక్తంగా నిర్వహించి, వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు, బంగారు అభరణాలతో విశేష అలంకరణలు గావించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ మమత, అర్చకులు సూరి స్వామి, సుబ్రమణ్య స్వామి, మిట్టగంగమ్మ ఆలయ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## బాలిక కనబడుటలేదు..!

**పోలీసులకు ఫిర్యాదు కేసు నమోదు.**



చంద్రగిరి, ఆగస్టు 8 ప్రభాతవార్త: మండల పరిధిలోని మండపం పల్లికి చెందిన ఓ బాలిక కనబడుటలేదంటూ తల్లిదండ్రులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో చదువుతున్న 16 ఏళ్ళ బాలిక పాఠశాల వదలిన అనంతరం ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. సిఐ ఇమ్రాన్ ఆదేశాల మేరకు బాధితుల నుండి ఫిర్యాదు తీసుకున్న పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ బాలిక ఆచూకీ తెలిసిన వారు చంద్రగిరి పోలీసులకు 6305014261, 9014457625 నంబర్లతో పాటు ఎస్ పురుషోత్తం ఆచారి మొబైల్ 9347895023 నంబర్‌కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.

## డి ఫార్మసీ అడ్మిషన్లకు దరఖాస్తులు

**తిరుపతి విద్య, ఆగస్టు 8 ప్రభాతవార్త :**

టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న పద్మావతి మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో డీ ఫార్మసీ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తునట్లు టీటీడీ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ,బైపీసీ ఉత్తీర్ణులైన ఆసక్తిగల విద్యార్థినులు కళాశాలలో నేరుగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9299008151, 9247575386, 8978993810 నంబర్ల నందు సంప్రదించాలని సూచించారు.

## నవోదయలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

**తిరుపతి విద్య, ఆగస్టు 8 ప్రభాతవార్త :**

జవహర్ నవోదయ విద్యాలయంలో 2026 27 విద్యాసంవత్సరానికి సంబంధించి 9వ,11వ తరగతులలో మిగిలి ఉన్న సీట్ల భర్తీ కోసం ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ కేవీఎన్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 9వ తరగతిలో ప్రవేశాల కోసం ఏదైని ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదివి 2011 మే 1వతేదీ, 2013 జూలై 31వ తేదీల మధ్య జన్మించిన విద్యార్థులు అర్హులని తెలియజేశారు. అలాగే 11వ తరగతిలో ప్రవేశాల కోసం ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి చదివి 2009 జూన్ 1వతేదీ, 2011 జూలై 31వ తేదీల మధ్య జన్మించిన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు.

## ఫుడ్ సేఫ్టీ అధికారులు దాడులు

**రేణిగుంట, ఆగస్టు 8 ప్రభాతవార్త :**



పట్టణంలో శుక్రవారం ఫుడ్ సేఫ్టీ అథారిటీస్ ఆఫ్ ఇండియా జాయింట్ ఫుడ్ కంట్రోలర్ పూర్ణచంద్రరావు, లీగల్ మెట్రాలజీ కంట్రోలర్ సుధాకర్ తమ సిబ్బందితో ఆకస్మిక దాడులు నిర్వహించారు. చెక్ పోస్ట్ సమీపంలోని ఒక ఫుడ్స్ బేకరీ పై (బిస్కెట్లు, కేకుల తయారీ కర్మాగారం) దాడులు నిర్వహించడంతో ఆసక్తికరమైన విషయాలు వెలుగు చూశాయి. లైసెన్స్ లేకుండా ఉత్పత్తులను తయారు చేయడమే కాకుండా కాలం చెల్లి చెడు వాసన వస్తున్న పిండి, ఫుడ్ కలర్స్ బదులు రసాయనాలు, పాడైపోయిన గుడ్లు తదితర ముడి సరుకుతో పిల్లలు తినే పదార్థాలను తయారు చేస్తున్నట్టు తెలుసుకున్నారు. స్టాకు నిల్వ ఉంచే గదుల్లో పారిశుద్ధ్య లోపాన్ని గుర్తించారు. కర్మాగార పరిస్థితిని తెలుసుకొని తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ప్రజల ఆరోగ్యంతో ఆడుకోవడం మంచి పద్ధతి కాదని బేకరీ ప్రతినిధులను హెచ్చరించారు.

## నమాజులో ఏకాగ్రత ఎంతో అవసరం

**శ్రీకాళహస్తి,ఆగస్టు 8 ప్రభాతవార్త :**



మనం ఆచరించే నమాజులను ఏకాగ్రతతో అల్లాహ్ మెచ్చేరీతిలో నచ్చే విధంగా ఆచరించాలని హాఫీజే ఖుర్ అన్ రేహాన్ పిలుపు నిచ్చారు. శుక్రవారం జామియా మస్‌జిద్‌లో ప్రత్యేక ప్రార్థనల సందర్భంగా ఆయన దివ్యఖుర్ ఆన్‌లోని అంశాలను వివరిస్తూ నమాజు అల్లాహ్‌కు మెచ్చేరీతిలో ఆచరించాలన్నారు. నమాజు ఆచరించే సమయంలో ఏకాగ్రతతో కూడుకున్నదిగా ఉండాలన్నారు. నమాజు మనిషిని అల్లాహ్‌తో పలకరించే సుమార్గం అన్నారు.మనం ఆచరించే ప్రార్థనల్లోనిర్లక్ష్యం ఉండరాదన్నారు. మన జీవితం మన చేతుల్లో లేదని ఏదో ఒక రోజు మృత్యుకౌగిలిలో ఒదిగి పోవాలని వెళ్ళె ముందు పుణ్యాలతో సర్గస్తులు కావాలని నరక కూప బాధల నుంచి తప్పించుకోవాలని రేహాన్ సూచించారు.

## ఆసుపత్రి రోడ్డులో గస్తీ పెంచండి...కాంగ్రెస్ వినతి

**శ్రీకాళహస్తి,ఆగస్టు 8 ప్రభాతవార్త :**



శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రి రోడ్డులో పోలీసు గస్తీ పెంచాలని శుక్రవారం కాంగ్రెస్ నాయకులు స్తానిక డివైయస్‌పికి వినతి పత్రం అందించారు. ఏరియా ఆసుపత్రి రోడ్డులో మహిళా జూనియర్ కళాశాల, జూనియర్ కళాశాల, కమ్యూనిటి హాస్టల్స్‌తో పాటు అన్నా క్యాంటిన్, వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, ఓ ప్రైవేటు పాఠశాల, కళాశాల ఉంది. విద్యార్థులు ప్రజల భద్రత కల్పించాల్సిన బాధ్యత పోలీసుశాఖపై ఉందని వివరించారు.కాంగ్రెస్ నియోజకవర్గ సమన్వయకర్త తలపాదామోదర్‌రెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు సరేంద్రరెడ్డి, రాహుల్, నవీన్, పురుషోత్తమ రాజు, నాగరాజు, అరుణ్, సంతోష్,జోసేఫ్, చరన్, సారధి, ఆసీస్, తేజ,మహేష్‌లు కలసి వివరించారు.

## ధర్మకర్తల మండలికి దరఖాస్తు చేసుకోండి

**శ్రీకాళహస్తిరూరల్, ఆగస్టు 8 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ఏర్పేడు మండలంలో వెలసిన గుడిమల్లం మహిమాన్విత ఆలయానికి ధర్మకర్తల మండలి నియామకానికి ప్రభుత్వం జివో జారి చేసిందని ఆలయ కార్యనిర్వహ ణాధికారి రామచంద్రారడ్డి శుక్రవారం మీడియాకు తెలిపారు. ఇక్కడ ధర్మకర్తల మండలిలో సభ్యుల నియామకానికి ఆశావహులు దరఖాస్తులు చేసుకోవచ్చునని ఆయన వివరించారు. 20రోజుల లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆయన వివరించారు. దరఖాస్తులను తిరుపతిలోని ఆర్‌జేసి కార్యాలయానికి నేరుగా చేర్చాలని రామచంద్రారెడ్డి తెలిపారు.ఈ మేరకు ధార్మిక పరిషత్ మెంబర్ కార్యదర్శి కే.మామచంద్రమోహన్ పేర ఉత్తర్వులు జారి అయ్యాయి.

## ఎంఆర్‌సి జెండా ఆవిష్కరణ

**తొట్టంబేడు,ఆగస్టు 8 ప్రభాతవార్త:**



తొట్టంబేడు మండలం చిట్టత్తూరు దళితవాడ,అరుంధతి వాడల్లో శుక్రవారం ఎంఆర్‌సి జెండాను ఆవిష్కరించారు. వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు తిరుపతి జిల్లా ఉపాధ్యక్షుడు, శ్రీకాళహస్తినియోజక వర్గ ఇన్‌చార్జి ఇర్ల రాజా మాదిగ సారధ్యంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మిఠాయిలు పంపిణి చేసారు.ఈ కార్యక్రమాల్లో యువసేన అధ్యక్షుడు మన్నెపల్లి ఈశ్వర్ మాదిగ, శ్రీకాళహస్తి ఎంఆర్‌సి పట్టణ అధ్యక్షుడు వెంకటముని కృష్ణ మాదిగ, మహేష్ మాదిగ, బాలరాజు మాదిగ, మోహన్‌మాదిగ, చిట్టతూరు ఎంఎర్‌సి నాయకులు పాల్గొన్నారు.

## గుడిమల్లం నుంచి సారె

**శ్రీకాళహస్తిరూరల్,ఆగస్టు 8 ప్రభాతవార్త :**



ఏర్పేడు మండలం పాపానాయుడు పేటలో జరుగుతున్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం అర్జున తపస్సు కార్యక్రమాలను ఏర్పాటు చేసారు.ఈ కార్యక్రమాలకు గుడి మల్లి ఆలయం నుంచి సారెను ఇఓ రామచంద్రారెడ్డి, మాజీ చైర్మెన్ గిరినాయుడు దంపతులు అందించారు. ఆలయం వద్దకు సారెను తీసుకురాగా అక్కడ ఆలయం నిర్వాహకులు మేళ తాళాలు మంగళవాయిద్యాలతో స్వాగతం పలికారు.. సారెతో పాటు మండల పార్టీ అధ్యక్షుడు పేరం నాగరాజు నాయుడు,అర్జున్‌బాబు,కృష్ణప్ప మొదలి తదితరులు పాల్గొన్నారు.

## స్వామి అమ్మవార్ల పవిత్రాల సమర్పణ

**శ్రీకాళహస్తిరూరల్,ఆగస్టు 8 ప్రభాతవార్త :**



శ్రీకాళహస్తి మండలం తొండమాన్ పురంలో వెలసిన శ్రీదేవి,భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న పవిత్రోత్సవాల సందర్భంగా శుక్రవారం భక్తి శ్రద్దలతో పవిత్రాలను సమర్పించారు. మూడు రోజులుగా జరుగుతున్న కార్యక్రమాలకు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తండోపతండాలుగా పాల్గొన్నారు. ఉదయం నుంచి ఆలయంలో భక్తుల తాకిడి పెరిగింది. టిటిడికి అనుబంధంగానిర్వహిస్తున్న ఈ ఆలయంలో టిటిడి నిర్వహించే ప్రతి కార్యక్రమాలను ఇక్కడ భక్తి శ్రద్దలతో నిర్వహిస్తారు.ఈ నేపధ్యంలో శుక్రవారం స్వామి అమ్మవార్లకు పవిత్రాలను సమర్పించారు. సూపరింటెండెంట్ జ్ఞాన ప్రకాష్,టెంపుల్ ఇన్స్పెక్టర్ సుధీర్,మహేష్,అర్చకులు రమణస్వామి కృష్ణస్వామి, గోపి స్వామి, బాబు స్వామిలు లు నిర్వహించారు. కాగా గ్రామానికి చెందిన కందాటి శేఖర్‌రెడ్డి సారధ్యంలో హాజరైన భక్తులకు సదుపాయాలు కల్పించారు.

# తిరుపతి డివిజన్

## శ్రీవారి దర్శనంతో ఆనందం

**తిరుమల,ఆగస్టు8ప్రభాతవార్త**



ప్రతినిధి: శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనంతో మనసు ఆనందం కలుగుతుందని, స్వామివారి ఆశీస్సులు ప్రజలందరికీ కలగాలని చిత్తూరు ఎంఎల్‌ఏ గురజాల జగన్‌మోహన్ ఆకాంక్షించారు. శుక్రవారం ఉదయం విఐపి బ్రేక్ దర్శనంలో ఎంఎల్‌ఎతో బాటు నెక్ రమేశ్,నూతన వధూవరులు గురజాల జీవన్, డిప్యూటీ మేయర్ రాజేశ్‌కుమార్‌రెడ్డి స్వామిని దర్శించుకున్నారు.

## గంగమ్మ ఆలయంలో వేడుకగా చండీహోమం

**తిరుపతి రవాణ, ఆగస్టు 8ప్రభాతవార్త:**

తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో శ్రావణ పౌర్ణమి వేళ శుక్రవారం ఉదయం చండీహోమం, వరలక్ష్మీవ్రతాన్ని ఆలయ అర్చకులు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఉదయం నుండి మధ్యాహ్నం వరకు ఈ వ్రతాన్ని శాస్త్రోక్తంగా, వేదమంత్రోచ్ఛరణల నడుమ జరిపించారు. ఆయా భక్తులు గోత్రనామాలతో అర్చకులు హోమాన్ని చేయించారు. మహాపూర్ణాహుతితో చండీ హోమం ముగిసింది. ఆలయ ఈఓ జయకుమార్,ఆలయ సిబ్బంది గృహస్థ భక్తులకు అమ్మవారి దర్శనం చేయించి సౌభాగ్యం పూజా ప్రసాదాలను పంపిణీ చేశారు. ప్రజలందరూ సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు.

## తాతయ్యగుంట గంగమ్మ పాలకమండలి ఏర్పాటుకు నోటిఫికేషన్

**తిరుపతి రవాణ, ఆగస్టు 8ప్రభాతవార్త:**




తాతయ్యగుంట గంగమ్మఆలయ పాలక మండలి ఏర్పాటుకు రాష్ట్రదేవాదాయశాఖ కమిషనర్ నోటీపికేషన్ జారీచేశారు. నూతన పాలకమండలి నియమాకానికి అర్హులైన,ఆసక్తి ఉన్న వారినుండి 20రోజుల్లోపే తమ దరఖాస్తులను గంగమ్మ ఆలయ ఈఓకు అందజేయాలని తెలిపారు. పాలకమండలి చైర్మన్, సభ్యులనియమాకం కానుంది.

## అక్రిడేషన్ కార్డు మంజూరు చేయాలి

**కేవీబీపురం,ఆగస్టు 8 ప్రభాతవార్త:**

జర్నలిస్టులకు కొత్త అక్రిడేషన్ కార్డు ప్రభుత్వం మంజూరు చేయాలని మండల జర్నలిస్టుల సంఘం ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు మునిభాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రమైన కేవీబీ పురంలో శుక్రవారం జర్నలిస్టులు ప్రెస్ క్లబ్ కమిటీ సభ్యుడు మునిభాస్కర్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం జర్నలిస్టులకు బీమా పథకం ఇంటి స్థలాలు పక్కా గృహాల నిర్మాణం తదితర సౌకర్యాలు కల్పనకు హామీలు ఇచ్చారని తెలిపారు. సమావేశంలో మండల మీడియా మిత్రులు, విలేకరులు పాల్గొన్నారు.

## రెండు బైక్‌లు ఢీ...వాహనదారులకు గాయాలు

**కేవీబీపురం, ఆగస్టు 8 ప్రభాతవార్త:**



ఎదురు ఎదురుగా రెండు బైక్‌లు ఢీకొని వాహన దారులకు గాయాలైన సంఘటన కేవీబీ పురం మండలం మఠం గ్రామం వద్ద గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. మండలంలోని మఠంగ్రామం వద్ద శ్రీకాళహస్తి వైపు వెళుతున్న బైక్ అలాగే పిచ్చాటూరు వైపు వస్తున్న మరో బైకు ఎదురు ఎదురుగా రెండు బైక్ ఢీకొన్నాయి. దీంతో వాహన దారులు రోడ్డుపై తీవ్ర గాయాలకు గురయ్యారు. వీరిని 108 ద్వారా శ్రీకాళహస్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు. రెండు బైక్‌లో పల్సర్ బైక్ వాహనదారుడిది నింద్ర మండలం కావనూరు దళితవాడకు చెందిన వాడుగా గుర్తించినట్లు సమాచారం. వివరాలు తెలియాల్సి ఉంది.

## 12న ర్యాలీని విజయవంతం చేయాలి

**కేవీబీ పురం, ఆగస్టు 8 ప్రభాతవార్త:**

ఈ నెల 12న ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అధ్యక్షతన తిరుపతి పట్టనంలో జరిగే బీజేపీ ర్యాలీని విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకులు తెలిపారు. కావున ర్యాలీలో మండలంలోని బీజేపీ నాయకులు, కార్యకర్తలు, టీడీపీ నాయకులు, జనసేన నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

## భక్తి ప్రవర్తలతో నంది సేవ



**పుత్తూరు రూరల్, ఆగస్టు 8 ప్రభాతవార్త:** పుత్తూరు పట్టణంలోని శ్రీ ద్రౌపదీదేవి సమేత శ్రీ ధర్మరాజుల స్వామి బ్రహ్మోత్సవాలు సందర్భంగా ఆది దంపతులైన శ్రీ పార్వతీ పరమేశ్వరులు నంది వాహ నంపై ప్రత్యేక పుష్పాలతో అలంకరించి మంగళ వాయి ద్యాల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం అర్జునుడికి పాశు పతాస్త్రం ఇచ్చే కార్యక్ర మాన్ని నిర్వ హించారు. అలాగే చిరుజ్ఞాన సంబంధర్ తిరుమటం భక్తి బృందం పరిచే శివ భూత గణనాథ వాయిద్యాల తో స్వామివారిని, అమ్మవారిని ఊరేగించారు. అమ్మవారికి కర్పూర హారతులు ఇచ్చి పూజలు చేశారు.

## తపస్సుమాన్‌లో స్కాట్స్ అండ్ గైడ్స్‌సేవలు

**పుత్తూరు రూరల్, ఆగస్టు 8 ప్రభాతవార్త:**



పుత్తూరులో వరలక్ష్మి వ్రతం సందర్భంగా అర్జునుడు తపస్సు మాన్ వైభవంగా జరిగింది. భక్తుల రద్దీ ఉద్దేశించి స్కాట్స్ అండ్ గైడ్స్ 300 మంది విద్యార్థులతో అర్జునుడి తపస్సు మాన్ ముందు వరపడి భక్తుల తోపులాట్లు ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమం జిల్లాఆర్గనైజింగ్ కమిషనర్ వెంకటేశ్వరులు ఆధ్వర్యంలో నిర్వహిస్తూ సహాయకులుగా స్కాట్ మాస్టర్ జయప్రకాష్,గజరాజన్,కేశవులు, అశోక్ కుమార్, గైడ్స్ క్యాంపు ఆఫీసర్, గైడ్ క్యాప్టెన్ రెడ్డిరాణి, రేంజర్ లీడర్స్ శైలజ, యువశ్రీ, మేఘన, జోష్ణ, జడ్పీ హైస్కూలు విద్యార్థులు పాల్గొన్నారు.

## బలిజ సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి సారె

**పుత్తూరు రూరల్, ఆగస్టు 8 ప్రభాతవార్త:**

పుత్తూరు పట్టణంలో శ్రీ ద్రౌపదీదేవి సమేత శ్రీ ధర్మరాజుల స్వామి బ్రహ్మోత్సవ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా పుత్తూరు బలిజ సంఘం నుంచి దప్పు వాయిద్యాలనడుమనృత్యాలువేసుకుంటూపురవీధుల్లోఊరేగింపుగాఅమ్మవారి దేవాలయానికి చేరుకున్నారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణి

**తిరుపతిరూరల్,ఆగస్టు 8 ప్రభాతవార్త:**



చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని తిరుపతి రూరల్, పాకాల, రామచంద్రాపురం, చంద్రగిరి, చిన్నగొట్టుగల్లు, యర్రావారిపాలెం మండలాల సంబంధించి అనారోగ్యాలతో బాధపడుతున్న బాధితులకు రూ.23లక్షల 17వేల 298 రుపా యాల సిఎంఆర్ఎఫ్ నిధులను ఎమ్మెల్యే పులివర్తి నాని అందజేసారు. శుక్రవారం తనపల్లి రఘునాథ్ రిసార్ట్స్‌లో వున్న టిడిపి పార్టీ కార్యాలయంలో బాధితులకు అందజేసారు. ఈ కార్యక్రమంలో తిరుపతిరూరల్ టిడిపి అధ్యక్షుడు ఎ.ఈశ్వరరెడ్డి, అలిమినేని మధు తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక అలంకరణలో చాముండేశ్వరి దేవి

**తిరుపతిరూరల్,ఆగస్టు 8 ప్రభాతవార్త:**



వరలక్ష్మీ వ్రతం పురస్కరించుకుని శుక్రవారం శ్రీ శక్తి చాముండేశ్వరి దేవి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శన మిచ్చారు. అమ్మవారి ఆలయంలో అభిషేకం, ప్రత్యేక అలంకరణ, హోమం, వరలక్ష్మీ దేవి వ్రతం నిర్వహించారు. ఆలయధర్మక బిరుదాల భాస్కర్‌రెడ్డి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసారు. సాయంత్రం శ్రీశక్తి చాముండేశ్వరి అమ్మవారికి 9రకాల దీపాలతో దీప హారతులు ఇచ్చి, ప్రత్యేకంగా పౌర్ణమి తీపం వెలిగించారు.

# కిలివేటి X రెవెన్యూ

సూళ్లూరుపేట, ఆగస్టు 8 ప్రభాతవార్త : మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య గురువారం ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లి నియోజకవర్గంలో అక్రమ ఇసుక, గ్రావెల్ తవ్వకాలపై ఆర్డీఓ కిరణ్మయికి ఫిర్యాదు చేయడమే కాకుండా పదిరోజుల డెడ్‌లైన్ విధించిన విషయం విదితమే. కాగా, ఈ విషయమై రెవెన్యూ ఉద్యోగ సంఘాల వారు ఘాటుగా స్పందించారు. మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య 50 మంది అనుచరులతో ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లి, కార్యాలయంలో ఆర్డీఓ లేనప్పుడు ఆమె ఛాంబర్‌లో కూర్చోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఆర్డీఓ ఛాంబర్‌లో ఎన్నో ముఖ్యమైన ఫైళ్లు ఉంటాయని, ఈ నేపథ్యంలో కార్యాలయంలోకి అనుమతి లేకుండా వెళ్లడం పద్ధతిగా లేదని తెలిపారు. ఆర్డీఓను కలవాలంటే ముందుగా కలిసే వారి పేర్లు నమోదు చేసుకుని కలవవచ్చని, కానీ అందుకు విరుద్ధంగా పెద్దసంఖ్యలో ఆర్డీఓ కార్యాలయానికి చేరుకుని నియోజక వర్గంలోని సమస్యలపై ఫిర్యాదు చేయడం మంచి పరిణామం కాదన్నారు. అలాగే ప్రజాప్రతినిధులైన వారు సమస్యలపై అధికారులకు విన్నవించాలని, అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నవారు కూడా ఈ పద్ధతి పాటించాలని రెవెన్యూ ఉద్యోగుల సంఘం వారు సూచించారు. అందుకు భిన్నంగా మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆగ్రహంతో మీడియా వారితో మాట్లాడారని, ఇది రెవెన్యూ ఉద్యోగుల మనోభావాలు దెబ్బతీసే విధంగా ఉందన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు అధికారులతో సమన్వయంతో కలిసిమెలిసి సమస్యలపై చర్చించాలని కోరారు. ఈ విషయమై శుక్రవారం రెవెన్యూ ఉద్యోగ సంఘం వారు పత్రికా ప్రకటన విడుదల చేశారు.

## నిధులు మంజూరు చేయండి

సూళ్లూరుపేట, ఆగస్టు 8 ప్రభాతవార్త : పట్టణంలోని ఎర్రబాలెం సమీపంలో అంబేడ్కర్ భవన నిర్మాణానికి కేటాయించిన స్థలంలోని అడ్డంకులు తొలగించి పునర్నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర మాలమహానాడు కన్వీనర్ ఆవల దాస్ శుక్రవారం విజ్ఞప్తి చేశారు. గత కొన్నేళ్లుగా అంబేడ్కర్ భవన నిర్మాణానికి స్థలం కేటాయించినప్పటికీ నిధులు కొరతతో భవన నిర్మాణం చేపట్ట లేదని తెలిపారు. ఈ విషయమై ఎమ్మెల్యే నెలవల విజయశ్రీకి, ఆర్డీఓ, మున్సిపల్ కమిషనర్‌లకు వినతిపత్రాలు అందజేశామని తెలిపారు. ఎస్సీ నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా గెలిచిన నెలవల విజయశ్రీ ఈ విషయంలో ప్రత్యేక చొరవ తీసుకుని సీఎం దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరయ్యేలా చేయాలని ఆవల దాస్ కోరారు.

## కార్యకర్త మృతికి ఎమ్మెల్యే నివాళి

కోట, ఆగస్టు 8 ప్రభాతవార్త : కోట మండలం మద్దాలి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు కాకాణి వెంకటరమణయ్య గురువారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. ఆ మేరకు శుక్రవారం గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ మద్దాలి గ్రామానికి వెళ్లి వెంకట రమణయ్య భౌతికకాయానికి నివాళి అర్పించారు. ఆ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట కోట మండల టిడిపి అధ్యక్షుడు పలగాటి భాస్కర్‌రెడ్డి, జలీల్ అహ్మద్, నెల్లూరు మోహన్‌రెడ్డి, వెంకన్నపాలెం సర్పంచ్ మధుయాదవ్, చిట్టేడు సొసైటీ ఛైర్మన్ చాపల శ్రీనివాసులు, చిన్నయ్య తదితరులు ఉన్నారు.

## ఈ నెల 12న బిజెపి సభను విజయవంతం చేయండి



వాకాడు, ఆగస్టు 8 ప్రభాతవార్త: ఈ నెల 12న తిరుపతిలో జరిగే బిజెపి సభలో బిజెపి రాష్ట్ర నూతన అధ్యక్షులు పివిఎన్ మాధవ్ పాల్గొంటా రని, సభను విజయవంతం చేయాలని కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేమారెడ్డి సురేందర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం వాకాడులో ఇరిగేషన్ అతిథి గృహంలో మండల బిజెపి అధ్యక్షుడు తూపిలి చంద్రారెడ్డి ఆధ్వర్యంలో మండల బిజెపి నాయకులతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వేమారెడ్డి సురేంద్రరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర బిజెపి నూతన అధ్యక్షులు మాధవ్ తొలిసారిగా తిరుపతి సభలో పాల్గొంటున్నారని ఉమ్మడి నెల్లూరు జిల్లా నుండి కార్యకర్తలు నాయకులు స్వచ్ఛందంగా తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో మండల బిజెపి అధ్యక్షులు తుపిలి చంద్రారెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ప్నామజి కృష్ణయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు, మాజీ మండల బిజెపి అధ్యక్షులు వల్లి ప్రసాద్, మండల ప్రధాన కార్యదర్శి కడూరు వెంకయ్య, మైనార్టీ నాయకులు గౌస్ బాషా, నాయకులు ప్రసాద్, రాకేష్ తదితరులు ఉన్నారు.

## గంగా కావేరి ఎక్స్‌ప్రెస్‌కు తప్పిన ప్రమాదం



గూడూరు, ఆగస్టు 8 ప్రభాతవార్త: నెల్లూరు జిల్లా మనుబోలు రైల్వే స్టేషన్ సమీపంలోని చర్లోపల్లి రైల్వే గేట్ దగ్గర గంగా కావేరి ఎక్స్‌ప్రెస్ కు ప్రమాదం తప్పింది. ఇంజన్ పక్కనే ఉన్న భోగి దగ్గర ఒకసారిగా దట్టమైన పొగలు వ్యాపించాయి. గంగా కావేరి ఎక్స్‌ప్రెస్ చాప్రా నుండి చెన్నై వెళ్తుండగా ప్రమాదం చోటుచేసుకుంది. ప్రయాణి కులు ఇచ్చిన సమాచారంతో డ్రైవర్ అప్రమత్తమై రైలును నిలిపివేశారు. పొగలు రావడం భయాందోళనకు గురైన ప్రయాణీకులు భోగీ నుండి బయటకు పరుగులు తీశారు. బ్రేక్స్ పట్టేయడంతో చక్రాల రాపిడితో పొగలు వచ్చినట్లు సమాచారం. ఈ ఘటనపై సమాచారం అందుకున్న రైల్వే అధికారులు ఘటన స్థలానికి చేరుకుని మరమ్మతులు చేపట్టారు. సుమారు అరగంట పాటు రైలును నిలిపివేసి మరమ్మతులు చేసి అనంతరం చెన్నై పంపారు.

## నల్లబ్యాడ్జీలు ధరించి అధ్యాపకులు నిరసన



గూడూరు, ఆగస్టు 8 ప్రభాతవార్త: స్థానిక ఎస్‌కెఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర జిసిజిటిఏ, జిసిటి ఏ రాష్ట్ర నాయకత్వ పిలుపు మేరకు అధ్యాపకులు, దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న వివిధ సమస్యల పరిష్కారం కోసం నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. అధ్యాపక బదిలీలు, జీవో నెంబర్. 42 రద్దు, రీ డెసిగ్నేషన్, ఇతర సమస్యలపై శుక్రవారం నుండి నిరసన కార్యక్రమాలు ప్రారంభించారు. దీనికి కొనసాగింపుగా ఈ నెల 11వ తేది నుండి 14వ తేది వరకు భోజన విరామ సమయంలో నిరసన ప్రదర్శనలు, విజయవాడ ధర్నా చౌక్‌లో జరు పతామని, 18వ వేది రాష్ట్ర స్థాయి ధర్నా ఉంటుందని తెలియజేస్తూ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శివ ప్రసాద్‌కి విజ్ఞాపన వివరణ పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పి.నారాయణ రాజు, జిసిజిటిఏ సభ్యులు, కోటేశ్వరరావు, లక్ష్మి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం

సూళ్లూరుపేట, ఆగస్టు 8 ప్రభాతవార్త: హిందువుల పవిత్ర పండుగ అయిన వరలక్ష్మీ వ్రతాన్ని శుక్రవారం మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శ్రావణమాసంలో వచ్చే మూడవ శుక్రవారంలో వ్రతాన్ని నిర్వహిస్తుంటారు. ఈ నేపథ్యంలో వరలక్ష్మీ వ్రతాన్ని ప్రతి ఇంట్లో భక్తిపూర్వకంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బజారువీధులన్నీ కళకళలాడాయి. వైష్ణవాలయాల్లో వరలక్ష్మీ వ్రతం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి.

## బిసి వసతిగృహాల్లో విద్యార్థుల అవస్థలు




నాయుడుపేట ఆగస్టు 8 ప్రభాతవార్త; సూళ్ళూరుపేట నియోజకవర్గంలోని బిసివసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో అవస్థలు పడుతున్నారు. నాయుడుపేట, గొట్టిప్రోలు, చిట్టమూరు, రోసనూరు బిసివసతి గృహాల్లో సుమారు 285మంది విద్యార్థులు చదువుతున్నారు. వారికి అధికారులు వసతిగృహాల్లో సరైన వసతులు కల్పించకపోవడంతో తంటాలు పడుతున్నారు. రాష్ట్రప్రభుత్వం విద్యార్థులకు వసతిగృహాల్లో మెరుగైన వసతులు కల్పించాలన్న ఉద్దేశంతో పనిచేస్తుంటే, నియోజకవర్గంలో బిసివసతి గృహాల్లో పనిచేస్తున్న వార్డెన్ల పనితరు అందుకు భిన్నంగా ఉంది. ప్రభుత్వం విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని పదేపదే చెప్తున్న వసతి గృహాల్లో వార్డెన్ల పనితీరు మాత్రం మారడంలేదు. వసతిగృహాల్లో చదువుతున్న విద్యార్థులకు మెనూ ప్రకారం ప్రతిరోజు ఆహారం ఇవ్వాల్సి ఉండగా అందులో కోడిగుడ్డు, పాలు, పండ్లు సక్రమంగా ఇవ్వడంలేదని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. నాయుడుపేట పట్టణంలోని లోతువాని గుంటలో ఉన్న బిసివసతి గృహంలో మరుగుదొడ్లు పక్కన మురికినీరు నిల్వచేరి దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో పాటు ఆవరణ చుట్టూ అపరిశుభ్రంగా ఉండటంతో రాత్రి సమయంలో పాములు, దోమల, తేళ్ళు బెడద ఎక్కువగా ఉందని విద్యార్థులు వాపోతున్నారు. గత ఏడాది నాయుడుపేటలోని అంబేద్కర్ గురుకుల పాఠశాలలో కలుషిత ఆహారం తీసుకొని విద్యార్థులు సుమారు 100మంది వరకు అస్వస్థతకు గురైన విషయం అందరికి తెలిసిందే.

## డ్రోన్ నిఘానేత్రంతో శ్రీ గంగమ్మ జాతర బందోబస్తు

**-డీఎస్పీ శ్రీనివాసరావు, తహశీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి**



రేణిగుంట, ఆగస్టు 8 ప్రభాతవార్త : శ్రీశ్రీశ్రీ గంగమ్మ తల్లి జాతరకు శాంతి భద్రతల పరిరక్షణ నిమిత్తం డ్రోన్ కెమెరాను ఏర్పాటు చేస్తామని రేణిగుంట డిఎస్పి శ్రీనివాసరావు అన్నారు. ఆగస్టు 11వ తేదీ నుండి 13 వతేదీ వరకు జరిగే శ్రీ గంగమ్మ జాతర నిర్వహణపై మండల ఉన్నతాధికారులు శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో శ్రీగంగమ్మగుడి కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. రేణిగుంట తహశీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, డిఎస్పి శ్రీనివాసరావు, ఆర్ ఐ జయ కృష్ణ, ఎంపీడీవో ప్రభురావు, సర్పంచి నాగేశం, రేణిగుంట పట్టణ టిడిపి అధ్యక్షుడు మహబూబ్ బాషా, టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ డి.పుష్పనాదం, వార్డ్ మెంబర్ టిడిపి యువనేత ఎంజి రెడ్డి, కన్నన్‌రెడ్డి, గుడికమిటీ చైర్మన్ సోలా మల్లికార్జున్ రెడ్డి, కమిటీ సభ్యులు సదాశివరెడ్డి తదితరులు జాతర నిర్వహణపై చర్చలు జరిపారు. వాహనాల పార్కింగ్, తిరుపతి శ్రీకాళహస్తి వైపు నుండి వచ్చే వాహనాల దారి మళ్లింపు పై నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బంది కలగకుండా జాతర శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని అన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కమిటీ మెంబర్లను కోరారు. తప్పనిసరిగా గుడి తరుపున వాలంటీర్లను నియమించి వారి వివరాలు పోలీసులకు తెలియజేయాలన్నారు. శ్రీ గంగమ్మ తల్లికి చీరాసారె సమర్పించు భక్తులకు టోకన్లు ఏర్పాటుచేసి భక్తులు అమ్మవారి ముందు గంటలసేపు నిలబడి క్యూలైన్‌లో ఉన్న భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా గుడి కమిటీ సభ్యులు చర్యలు తీసుకోవాలన్నారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, దొంగతనాలు అరికట్టడానికి, ఆకతాయిల ఆగడాలకు చెక్ పెట్టడానికి డ్రోన్ ద్వారా పర్యవేక్షిస్తామని తెలిపారు. జాతర నిర్వహణకు ఎలాంటి సహాయం కావాలన్నా పోలీసులు చేయడానికి సిద్ధంగా ఉన్నా న్నారు. జాతర నిర్విఘ్నంగా జరగడానికి సబ్ డివిజన్ పరిధిలోని పోలీసులు, స్పెషల్ పార్టీ పోలీసులను నియమిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో రేణిగుంట పట్టణానికి చెందిన వివిధ వ్యాపారస్తులు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

## ఒక గంటలో స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా రుణాలు




శ్రీకాళహస్తి, ఆగస్టు 8 ప్రభాతవార్త : పుణ్యక్షేత్రంలో వ్యాపారస్తులకు ఒక గంటలో రుణసదుపాయం కల్పిస్తామని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా మెయిన్ బ్రాంచి చీఫ్‌మేనేజర్ ఫణికుమార్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం శ్రీకాళహస్తిలోని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖల్లోని మేనేజర్లు, ఫీల్డ్ ఆఫీసర్లు కలసి పట్టణంలో భారీ ఎత్తున ర్యాలి నిర్వహించారు. ఈ ర్యాలి ప్రారంభంలో ఫణికుమార్ మాట్లాడుతూ శ్రీకాళహస్తిలోని వ్యాపారులకు ఆది నుంచి స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆదుకుంటుందన్నారు. రుణ సదుపాయాల కల్పనలో వ్యాపారస్తులు, మహిళా సంఘాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు వివరించారు. కొత్తగా ఈ ఏడాది నుంచి వ్యాపారస్తులకు జిఎస్‌టి. ఇన్‌కంటాక్సులు కరెక్టుగా ఉంటే ఒక్క గంటలో రుణ సదుపాయం కల్పిస్తామన్నారు. వ్యాపారుల కోసం కొత్త కొత్త రుణ సదుపాయాలను కల్పిస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమాల్లో ఎస్‌బిఐ చీఫ్‌మేనేజర్ ఫణికుమార్, ఎడిబి చీఫ్ మేనేజర్ మోహన్‌రాజు, దేవస్థాం బ్రాంచి మేనేజర్ రాఘవేంద్ర, కోవనూరు బ్రాంచి మేనేజర్ ఉమాశంకర్, ఫీల్డ్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు. నాలుగుమాడావీధుల్లో ప్రతి దుకాణం వద్దకు వెళ్లి రుణ వివరాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రచారం చేసారు.

## కన్నుల పండువగా అర్జున తపస్సు

**-కదలి తరంగాల్లా కదలి వచ్చిన జనం**



శ్రీకాళహస్తిరూరల్ ,ఆగస్టు 8 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి నియోజకవర్గం ఏర్పేడు మండలం పాపానాయుడుపేటలో జరుగుతున్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో శుక్రవారం అర్జున తపస్సు కార్యక్రమాలు కన్నుల పండువగా నిర్వహించారు. భక్తుల భాగస్వామ్యంతో నిర్వహించటం వల్ల చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తండోపతండాలుగా వచ్చారు. ఓ భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నా కార్యక్రమాలు విజయవంతంగా జరిగాయి. శ్రీకాళహస్తి పట్టణంలో దేవస్థానం కు అనుబంధంగా నిర్వహిస్తున్న ధర్మరాజుల ఉత్సవాల తరువాత పాపానాయుడుపేటలో అదే స్థాయిలో నిర్వహిస్తారు. ఉదయంయ నుంచి ఆలయం ఆవరణలో పొంగళ్ళు నిర్వహించారు. శుక్రవారం వరలక్ష్మీ వ్రతం కావటంతో పవిత్రమైన అర్జున తపస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా రంగస్థల కళాకారులు నృత్యాలతో ఆకట్టుకున్నారు. శివార్జునుల వృత్తాంతాలు సామాన్యులకు సైతం అర్థమయ్యేరీతిలో నిర్వహించారు. అర్జునుడు తపస్సు చేయటానికి వేదికను ఏర్పాటు చేసారు. అక్కడ నుంచి విబూది, నిమ్మపండ్లను చల్లుట, సంతానం లేని వారు వాటి కోసం ఎగబడటం కార్యక్రమాల్ని చక్కగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి అలంకారం భక్తులను ఇట్టే ఆకట్టుకుంది. రవికుమార్, కృష్ణప్ప మొదలి, అర్జున్‌బాబు, రోశయ్య, దొరకృష్ణ, త్యాగరాజు, మాధవయ్యలు పాల్గొన్నారు. ఉత్సవాలను చేనేత సంఘం సారధ్యంలో నిర్వహిస్తున్నారు.

## గంగాప్రసాద్‌ను సత్కరించిన ఎమ్మెల్యే



నారాయణవనం, ఆగస్టు 8 ప్రభాతవార్త : ప్రముఖ పారిశ్రామికవేత్త, సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు కొండేటి గంగాప్రసాద్‌ని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, అతని తనయుడు జడ్పీ ఫైనాన్స్ కమిటీ మెంబర్ కోనేటి సుమన్ కుమార్‌లు శుక్రవారం సూళ్లూరుపేటలోని ఆయన నివాసంలో కలిశారు. అనంతరం ఆయనిన్ని దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. ఆ తర్వాత సత్యవేడు నియోజకవర్గంలోని జరుగుతున్న రాజకీయ పరిణామాలపై చర్చించారు.

## స్వర్ణరథమెక్కిన సిరుల తల్లి

**పద్మావతిదేవి పాహిమాం అంటూ మహిళ భక్తులు లాగిన రథం**



తిరుచానూరు, ఆగస్టు 8ప్రభాతవార్త: శ్రావణమాసం వరలక్ష్మీవ్రతం పర్వదినాన తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారు శుక్రవారం సాయంత్రం సిరులతల్లి స్వర్ణరథం అధిరోహించి ఊరేగారు. బంగారురథంపై పద్మావతిదేవి భక్తులను కటాక్షించారు. ఆలయం ముందు వేదమంత్రోచ్చరణల నడుమ అమ్మవారిని బంగారురథంపై అధిరోహింపజేశారు. అర్చకులు కర్పూరహారతులిచ్చి ఆలయమాఢవీధుల్లో ప్రదక్షణగా బయలుదేరింది. పద్మావతిదేవి పాహిమాం అంటూ నామస్మరణలతో మహిళా భక్తులు స్వయంగా ఈ రథాన్నిలాగి భక్తిపారవశ్యంతో పునీతులయ్యారు. భక్తులు తిరుమాఢవీధులలో అడుగడుగునా నీరాజనాలు సమర్పించారు. టిటిడి ఈఓ శ్యామలరావు దంపతులు, ఆలయ డిప్యూటీ ఈఓ పి.హరీంద్రనాథ్, ఆలయ సూపరింటెండెంట్ వాణి, మహిళ భక్తులు పాల్గొన్నారు. వరుణదేవుడు పద్మావతిదేవిని సేవించినట్లు భక్తులు వానలోనే స్వర్ణరధాన్ని లాగారు.

## ఎర్రచందనం దుంగలు స్వాధీనం

**ముగ్గురు దొంగలు అరెస్టు, రెండు మోటారు సైకిళ్లు స్వాధీనం**



సత్యవేడు, ఆగస్టు 8 ప్రభాతవార్త: సత్యవేడు అటవీ పరిధిలోని జంబుకేశ్వరపురంలో ముగ్గురు ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేసి వారి నుంచి 24 ఎర్రచందనం దుంగలు, రెండు మోటారు సైకిళ్ళను టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ హెడ్ ఎల్.సుబ్బ రాయుడు ప్రత్యేక కార్యాచరణలో భాగంగా టాస్క్‌ఫోర్స్ ఎస్పీ పి.శ్రీనివాస ఆధ్వర్యంలో డీఎస్పీలు షరీఫ్, శ్రీనివాసరెడ్డి మార్గ నిర్దేశకత్వంలో ఆర్ఐ సాయి గిరిధర్‌కు చెందిన ఆర్ఎస్ఐ టి.విష్ణువర్ధన్ కుమార్ టీం గురువారం సత్యవేడు అటవీ పరిధిలో స్థానిక ఎఫ్‌బీవో కె.వేణుగోపాల్‌తో కలసి కూంబింగ్ చేపట్టారు. శుక్రవారం వేకువ జామున జంబుకేశ్వరాపురం నీలగిరి తోటకు చేరుకోగా అక్కడ రెండు మోటారు సైకిళ్ళతో కొంత మంది వ్యక్తులు కనిపించారు. వారిని చుట్టుముట్టేప్రయత్నం చేయగా వారిలో కొందరు పారిపోయారు. అయితే ముగ్గురిని పట్టుకున్నారు. వారు సమీపంలో దాచిన 24 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో ఒకరు తిరుపతి జిల్లాకు చెందిన వ్యక్తిగా గుర్తించారు.

# గూడూరు డివిజన్

## శ్రీ ధర్మరాజు స్వామి ఆలయంలో వరలక్ష్మి వ్రతం



గూడూరు, ఆగస్టు 8 ప్రభాతవార్త : శ్రావణమాసం సందర్భంగా గూడూరులోని శ్రీ ధర్మరాజు స్వామి వారి దేవస్థానంలో శుక్రవారం వరలక్ష్మి వ్రతం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని వివిధ సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి, వివిధ పుష్పాలతో అమ్మవారిని అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేసారు. అనంతరం సహస్రకుంకుమార్చన వేదపండితులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓ రవికృష్ణ, సిబ్బంది, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## బిసిఎన్ గ్రూప్స్‌చైర్మన్ బిసి నాగరాజ్‌కు డాక్టరేట్ ప్రదానం



కుప్పం, ఆగస్టు 8ప్రభాతవార్త: పాతికేళ్లుగా కుప్పం ప్రాంతంలో విద్యారంగాన్ని అభివృద్ధి చేయడంలో అహర్నిశలుశ్రమిస్తూ వేలాది మంది విద్యార్థుల విద్యార్థుల జీవితాల్లో వెలుగులు తీసుకువచ్చిన కుప్పం బిసిఎన్ గ్రూప్స్ ఛైర్మన్ బిసి నాగరాజ్ సేవలను ప్యారిస్ దేశంకు చెందిన ప్రపంచ ప్రసిద్ధ థేమ్స్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ గుర్తించింది. ఆయన చేసిన సేవలకు గాను గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. పేద, అణగారిన కుటుంబాల విద్యార్థులకు సాంకేతిక, వృత్తిపరమైన విద్యను అందించి వారు సామాజిక, ఆర్థిక రంగాల్లో అభివృద్ధి చెందేలా చేశారు. బిసిఎన్ విద్యాసంస్థల్లో ఇంజనీరింగ్, డిగ్రీ, నర్సింగ్, జూనియర్ కాలేజ్, స్కూల్ స్థాయిలో నాణ్యమైన విద్యకు మారుపేరుగా నిలిచేలా ఆయన కృషి చేశారు. ఈసందర్భంగా డాక్టర్ బిసి నాగరాజ్ మాట్లాడుతూ ఈ గౌరవం తనకు వ్యక్తిగత విజయమే కాదని ఇది బిసిఎన్ విద్యాసంస్థల్లో చదువుతున్న వేలాది మంది విద్యార్థులు, వారి కుటుంబాల గౌరవం, కుప్పం నియోజకవర్గ విద్యారంగానికి లభించిన గొప్ప గౌరవం అన్నారు.

## విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి!



కాణిపాకం, ఆగస్టు 8 ప్రభాతవార్త: విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి చెందిన సంఘటన కాణిపాకం పోలీస్ స్టేషన్ పరిధిలోని కాణిపాకం గ్రామ పంచాయతీ కాకర్లవారిపల్లిలో శుక్రవారం సాయత్రం జరిగింది. వివరాలిలా వున్నాయి. కాకర్లవారిపల్లికి చెందిన జానకి రామనాయుడు(53) అనే వ్యక్తి తన వ్యవసాయ పొలం వద్ద పశువులకు మేతకు తీసుకెళ్ళాడు. ఈ సందర్భంగా ఆవు బోరు మోటరు వద్దకు వెళ్తుండగా భయంతో విద్యుత్ షాక్‌కు గురి అవుతుందని విద్యుత్ మోటరుకు వున్న విద్యుత్ తీగలను ప్రక్కకు తప్పించడానికి ప్రయత్నించడంతో విద్యత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో గ్రామంలో విషాద ఛాయలఉు అలముకొన్నాయి. జానకిరామనాయుడు గతంలో ఆలయంలో ఉద్యోగిగా పని చేసేవాడు. ఈ మేరకు కాణిపాకం పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహంను పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## తొండవాడ ఘటనపై పోలీసు కేసు నమోదు

**బస్ షెల్టర్ కూల్చివేత, చెట్టు నరికివేత,**



చంద్రగిరి, ఆగస్టు 8 ప్రభాతవార్త: తొండవాడ బస్టాండ్ ఘటనపై చంద్రగిరి పోలీసులు 5 మందిపై కేసులు నమోదు చేశారు. చంద్రగిరి మండలంలో పాతికేళ్ళకు పైగా సాగుతున్న బంధం అంత తేలికగా వీడిపోదనేందుకు నిలువెత్తు సాక్ష్యంగా తొండవాడ ఘటన నిలుస్తున్నది. (అప్పుడు కాంగ్రెస్, గత 10 ఏళ్ళుగా వైసిపి) వైసిపి టిడిపి మిలాఖత్ కారణంగా లభించిన బరితెగింపు అనేక దుస్సాహలకు తొండవాడ బస్టాండ్ వేధిక అయ్యింది. తొండవాడ బస్టాండ్ వద్ద ప్రయాణికుల సౌకర్యార్థం గ్రామానికి చెందిన ఇందుమౌళి రెడ్డి తమ సొంత నిధులతో బస్ షెల్టర్ నిర్మించారు. అయితే కాలం మారుతున్న కొద్దీ భూ విలువలు ఆకాశాన్నంటుతుండటంతో తొండవాడలో రియల్ ఎస్టేట్ రంగం విశేషంగా పుంజుకున్నది. ఈ నేపథ్యంలో తొండవాడ బస్టాండ్ సమీపంలో అడుగు స్థలం రూ.3 వేల నుండి 4 వేలు ధర పలుకుతున్నట్లు తెలిసింది. దీంతో ఇక్కడ ఎవరి ప్రయోజనాల కోసం, ఏమి ఆశించి పనిచేయాల్సి వచ్చిందో మరి టిడిపి, వైసిపి నాయకులు ఏకమై రాత్రి వేళ బస్ షెల్టర్‌ను కూల్చివేశారు. అంతటితో ఆగకుండా వందల ఏళ్ళ నాటి మర్రిచెట్టును మొదలు మినహా దాదాపు పూర్తిగా తొలగించారు. ఈ క్రమంలోనే విద్యుత్‌శాఖ అధికారులకు కనీస సమాచారం ఇవ్వకుండానే విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. విద్యుత్ సరఫరా ఆగడంతో గ్రామస్థులు అధికారులకు ఫోన్లు చేసి సరఫరా ఎందుకు ఆపారని ప్రశ్నించడంతో అసలు విషయం వెలుగు చూసింది. ఈ నేపథ్యంలో ఆర్‌అండ్‌బి ఏఈ అజయ్‌కుమార్ రెడ్డి ఫిర్యాదు మేరకు తొండవాడకు చెందిన వైసిపి నాయకుడు మల్లం చంద్రమౌళి రెడ్డి, టిడిపి నాయకులు విజయభాస్కర్ రెడ్డి, మండపం పల్లికి చెందిన చెంగారెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అదేవిధంగా ఇటాచ్‌కి సబంధించిన మధు, సంజయ్ ఇద్దరిపై కేసు నమోదు చేశారు. కేసులు నమోదు మినహా చర్యలు వుండకపోవచ్చనే పెదవి విరుపు మాటలు కొంత మంది నాయకులతో పాటు ప్రజల నుండి వినిపిస్తున్నాయి.

## అమ్మవారి కంకణాలు ధరించిన అధికారులు



తిరుచానూరు, ఆగస్టు ప్రభాతవార్త: పద్మావతి అమ్మవారి ఆలయంలో శుక్రవారం ఉదయం జరిగిన సామూహిక వరలక్ష్మీవ్రతంలో పాల్గొన్న టిటిడి అధికారులకు ఆలయ అర్చకులు స్వయంగా అమ్మవారి కంకణాలను ధరింపజేశారు. టిటిడి ఈఓ శ్యామలరావు, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, జెఈఓ వీరబ్రహ్మంకు ఆలయ అర్చకులు కంకణాలు కట్టించి ఆశీర్వదించారు.

## ప్రజలందరిపై అమ్మవారి కటాక్షాలుండాలి : తుడ ఛైర్మన్



తిరుచానూరు, ఆగస్టు 8ప్రభాతవార్త: పద్మావతి అమ్మవారి ఆలయంలో శుక్రవారం ఉదయం వరలక్ష్మీ వ్రతం జరిగింది, ఎంతో శాస్త్రోక్తంగా, మహోత్సవంగా జరిపించిన అర్చకులు శోభాయమానంగా వ్రతాన్ని ఆచరింపజేశారు. మహిళా భక్తులు పాల్గొని సుమంగళిపూజ నిర్వహించారు. తుడ ఛైర్మన్, టిటిడి బోర్డు సభ్యుడు దివాకర్‌రెడ్డి ఆలయం వెలుపల బిజెపి రాష్ట్రకార్యదర్శి కోలా ఆనంద్‌తో కలసి మీడి యాతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, సకాలంలో వర్షాలు కురిసి రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు దివాకర్‌రెడ్డి తెలిపారు.

## బ్రహ్మోత్సవాల తరహాలోనే...పౌర్ణమి గరుడసేవ

తిరుమల, ఆగస్టు 8ప్రభాతవార్తప్రతినిధి: సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఐదవరోజురాత్రి జరిగే గరుడవాహనసేవ తరహాలోనే శుక్రవారం రాత్రి మాదిరి గరుడ సేవప్రయోగాత్మకంగా నిర్వహించారు. శుక్రవారం శ్రావణమాస పౌర్ణమి పురస్కరించుకుని గరుడసేవ జరిపించడం ఆనవాయితీ. రాత్రి 7గంటలకు మారిది గరుడసేవ వేడుకగా నిర్వహించారు. ఈ వాహనసేవలో టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, సివిఎస్ఓ కెవి మురళీకృష్ణ, ఆలయ పేష్కార్ రామకృష్ణ, ఆలయ పారుపత్తేదార్ హిమత్‌గిరి, డిప్యూటీ ఈఓ భాస్కర్, సిఎస్ఓలు ఎస్వీరామ్‌కుమార్, సురేంద్ర, ఆలయ ఏవిఎస్ఓ రాజశేఖర్, భక్తులు, అర్చకులు పాల్గొన్నారు.

## బీహార్‌లో ఓటర్ల జాబితా... ప్రత్యేక సవరణతో ప్రజాస్వామ్యం ఖునీ

చిత్తూరు, ఆగస్టు 8 ప్రభాతవార్త: బీహార్ రాష్ట్ర ఎన్నికల్లో ఎలాగైనా విజయం సాధించాని నిర్ణయించిన భారతీయ జనతా పార్టీ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పేరుతో ప్రజాస్వామ్యంను ఖునీ చేస్తోందని దీనిని ప్రతి ఒక్కరు వ్యతిరేకించాలని సిపిఎం నాయకులు పిలుపునిచ్చారు. బీహార్ రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పేరిట జరుగుతున్న అన్యాయంపై శుక్రవారం చిత్తూరులో సిపిఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సిపిఎం నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని మతోన్మాద బిజెపి ప్రభుత్వం పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రమాదం కల్పించే పనులు చేపడుతుందన్నారు. స్వాతంత్ర్యంగా వ్యవహరించాల్సిన రాజ్యాంగ వ్యవస్థ ఎన్నికల సంఘం దానికి విరుద్ధంగా కేంద్ర హోంశాఖ మంత్రి ఆదేశాలతో ఓటర్ల జాబితాను సైతం మార్చివేసి బీహార్ రాష్ట్రంలో లక్షాలది ఓట్లను తొలగించడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు గంగరాజు, జ్యోతిరావు తదితరులు పాల్గొన్నారు.